www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక:40 | శనివారం | 12 సెప్టెంబర్, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169




# ప్రపంచానికి బ్రిక్స్ దిశానిర్దేశం

- ప్రపంచ జీడీపీలో 40 శాతం బ్రిక్స్ దేశాలదే
- ఐటీ, ఏఐ రంగాల్లో భారత్ దూసుకెళ్తోంది
- రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్
- అస్థిర పరిస్థితుల్లోనూ ఇండియా సుస్థిర అభివృద్ధి సాధిస్తోంది: మోదీ

**న్యూఢిల్లీ:** ప్రపంచంలో బ్రిక్స్ కూటమి ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ప్రపంచ జీడీపీలో దాదాపు 40 శాతం బ్రిక్స్ దేశాల నుంచే వస్తోందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సగానికిపైగా వాటా ఈ దేశాలదేనని పేర్కొన్నారు. ఢిల్లీలో నిర్వహించిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రసంగించిన ఆయన.. ప్రపంచానికి బ్రిక్స్ దిశానిర్దేశం చేస్తోందని అన్నారు.బ్రిక్స్ దేశాల్లో వేగంగా పట్టణీకరణ జరుగుతోందని, ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిస్తోందని పుతిన్ పేర్కొన్నారు. ఐటీ, కృత్రిమ మేధ (ఏఐ) రంగాల్లో భారత్ వేగంగా పురోగమిస్తోందని ప్రశంసించారు. చైనా కంపెనీలు సాంకేతిక రంగంలో ప్రపంచస్థాయి దిగ్గజాలుగా ఎదుగుతున్నాయని, ఏరోస్పేస్ రంగంలో బ్రెజిల్ తన సామర్థ్యాన్ని చాటుతోందని చెప్పారు. బ్రిక్స్ దేశాల నుంచి అనేక విజయగాథలు వెలుగులోకి వస్తున్నాయని, ఈ దేశాలు పశ్చిమ దేశాలతో పోటీ పడుతున్నాయని పుతిన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో ఇరాన్‌పై బహుముఖ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. అంతర్జాతీయ రవాణాకు ఆటంకాలు కలిగించడంతో పాటు ఇరాన్‌పై అక్రమంగా ఆంక్షలు విధిస్తున్నారని ఆయన విమర్శించారు. 2006లో నాలుగు దేశాలతో ప్రారంభమైన బ్రిక్స్ ప్రస్థానం ప్రస్తుతం 21 దేశాలకు

తరువాయి 2లో



## మోదీతో పుతిన్ భేటీ

- బ్రిక్స్ సదస్సుకు ముందు ఢిల్లీలో ఇరువురు నేతల సమావేశం

# విద్యతోనే పురోగతి

## భవిష్యత్ తరాలను తరగతి గదుల్లోనే తీర్చిదిద్దుదాం

- విద్యకు దూరమైతే ఎంత ఆస్తి ఉన్నా సామాజికంగా వెనుకబడాల్సిందే
- రాష్ట్ర విద్యా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మారుస్తున్నాం
- విద్యా వ్యవస్థలోని లోటుపాట్లను సరిదిద్దేందుకు ప్రత్యేక విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశాం
- ఏడాదిలో 11వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్..10,600 మందికి నియామక పత్రాలు
- విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేస్తాం
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజానావ, హైదరాబాద్: భవిష్యత్ తరాల విద్య, రాష్ట్ర పునర్నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభలో విద్యా రంగంపై మాట్లాడిన ఆయన.. సామాజిక వెనుకబాటుతనానికి ప్రధాన కారణం విద్యకు దూరం కావడమేనని పేర్కొన్నారు. 2024లో నిర్వహించిన సీపెక్ సర్వేను ప్రస్తావిస్తూ ఈ విషయాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఎంత ఆస్తి ఉన్నప్పటికీ విద్యకు దూరమైతే సామాజికంగా వెనుకబడే పరిస్థితి ఉంటుందని సీఎం అన్నారు. మనిషి జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లే శక్తి అక్షరానికే ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తెలంగాణ విద్యా వ్యవస్థను సమూలంగా మారుస్తున్నామని తెలిపారు.

### జెన్ జీ నుంచి జెన్ బీటా వరకు..

ప్రపంచంలో ఎల్పీజీ సంస్కరణల అనంతరం విద్యా వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో అనేక ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలకు పునాదులు వేసిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆలోచనా విధానాన్ని కొనసాగిస్తూ.. ప్రస్తుత జెన్ జీతో పాటు జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాల భవిష్యత్తును తరగతి గదుల్లోనే తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.

### జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా

విద్యా వ్యవస్థలోని లోటుపాట్లను సరిదిద్దేందుకు ఉమ్మడి రాష్ట్రంలో కూడా లేని విధంగా ప్రత్యేక విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా తెలంగాణకు నూతన మార్గదర్శకాలు రూపొందించేందుకు కేశవరావు కమిటీని నియమించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 28,163 ప్రభుత్వ విద్యాసంస్థల్లో 28.77 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. విద్యా సంస్థల్లో 1.57 లక్షల మంది సిబ్బంది పనిచేస్తున్నారని వివరించారు. రైట్ టు ఎడ్యుకేషన్ నిబంధనల ప్రకారం ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాల్సి ఉండగా.. తెలంగాణలో ప్రతి 17 మంది విద్యార్థులకు ఒక టీచర్ అందుబాటులో ఉన్నారని తెలిపారు.

### 55 రోజుల్లో 10,600 మందికి నియామక పత్రాలు

గత ప్రభుత్వం పదేళ్లలో కేవలం 7,857 మంది ఉపాధ్యాయులను నియమించిందని రేవంత్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది వ్యవధిలోనే 11 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. ఎలాంటి అవినీతికి, చిన్న విమర్శలకు కూడా అవకాశం లేకుండా కేవలం 55 రోజుల్లో 10,600 మంది ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేశామని పేర్కొన్నారు. గతంలో విద్యా రంగానికి తగ్గుతూ వచ్చిన బడ్జెట్ కేటాయింపులను తమ ప్రభుత్వం పెంచుతోందని తెలిపారు.శాసనసభ సభ్యులు విద్యా రంగంపై ఇచ్చిన విలువైన సూచనలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని.. రాష్ట్ర విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.



# సెలబ్రిటీలకూ ఎస్ఐఆర్ నోటీసులు

- సమంత, విజయ్ దేవరకొండ, వీవీఎస్ లక్ష్మణ్ తదితరులకు నోటీసులు
- ఓటర్ల జాబితా వివరాల ధ్రువీకరణలో భాగంగానే జారీ
- నోటీసు ఇచ్చినంత మాత్రాన ఓటు హక్కు రద్దు కాదు: సీఈసీ అధికారులు

2

# మోటర్లకు మీటర్లు పెట్టం

- ఆర్‌డీఎస్ఎస్‌తో విద్యుత్ వ్యవస్థ ఆధునికీకరణ
- వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ కొనసాగుతుంది
- ఎంపిక చేసిన గ్రామాల్లో బ్యాటరీ స్టోరేజీతో మైక్రో గ్రిడ్లు
- పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా హరిత ఇంధనంపై దృష్టి
- ఉపముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క



ప్రజానావ, హైదరాబాద్: రైతుల వ్యవసాయ మోటార్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయబోమని ఉపముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్ర విద్యుత్ సరఫరా వ్యవస్థను ఆధునికీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్‌డీఎస్ఎస్ పథకాన్ని వినియోగించుకుంటామని తెలిపారు. ఈ పథకంలో వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయాలనే నిబంధన లేదని స్పష్టం చేశారు. ఈ అంశంపై అనవసర భయాందోళనలు

తరువాయి 2లో

# కొండా తొలగింపు వెనుక భారీ భూ కుంభకోణం



2

- సీఎం సోదరుల భూ వ్యవహారాలను ప్రశ్నించినందుకే వేటు
- కాంగ్రెస్ పాలనలో 22ఏ భూముల జాబితా పెరిగింది
- ఈ వ్యవహారంపై ప్రభుత్వం సమగ్ర వివరణ ఇవ్వాలి
- దేశంలోనే అతిపెద్ద భూ కబ్జా పర్వం కొనసాగుతోంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## ప్రభాస్‌కు కేటీఆర్ ప్రాంక్ కాల్

- వైరల్‌గా మారిన వీడియో!
- ఫోన్ తీసుకున్న యువతి మాటలకు కాల్ కట్ చేసిన పాన్ ఇండియా స్టార్

2



# మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ

- పర్యావరణ అనుమతులను సవాల్ చేసిన రిటైర్డ్ ఇంజినీర్లు
- పర్యావరణ నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ పిటిషనర్ల ఆరోపణ
- తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు
- తదుపరి విచారణ అక్టోబర్ 16కు వాయిదా

2



# 22ఏ పేరుతో భూములకు భూ హారతి

- నిషేధిత జాబితాలో భూముల చేర్పు తప్పిదం కాదు.. ప్రభుత్వ దురుద్దేశమే
- ముఖ్యమంత్రి భూములపై దృష్టి పెట్టారు
- 22ఏ బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆపదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు

2

# 'కౌరవసభ'ను తలపించేలా దాడులు

- బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దురుసుగా వ్యవహరించారు
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే దాడులు జరిగాయి
- ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే శిఖండి రాజకీయాలు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- అసెంబ్లీ ముట్టడి ఘటనపై జాతీయ మహిళా, మానవ హక్కుల కమిషన్లకు ఫిర్యాదు

2



## ప్రపంచానికి బ్రిక్స్ దిశానిర్దేశం

(మొదటి పేజీ తరువాయి)

విస్తరించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచ జనాభాలో సగానికిపైగా ఈ దేశాల్లోనే ఉందని, ప్రపంచ వాణిజ్యంలో బ్రిక్స్ దేశాల వాటా 25 శాతంగా ఉందని తెలిపారు. నూతన ఆవిష్కరణలు, పరస్పర సహకారం, సుస్థిర అభివృద్ధికి బ్రిక్స్ దేశాలు బలమైన వేదికగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి, సుస్థిరతకు భారత్ చిరునామాగా మారుతోందని మోదీ అన్నారు. రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాల వంటి మౌలిక సదుపాయాల కల్పనలో దేశం వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. సెమీకండక్టర్లు, క్వాంటమ్ టెక్నాలజీ, నౌకా నిర్మాణం, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో భారత్ కొత్త అవకాశాలను సృష్టిస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా అస్థిర పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ సుస్థిర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని మోదీ పేర్కొన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కారాలను చూపించడంలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. భారత స్టార్టప్‌లు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఉద్ఘాటించారు.

## కొండా తొలగింపు వెనుక భారీ భూ కుంభకోణం

**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్ర మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడం వెనుక భారీ భూ కుంభకోణం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులకు సంబంధించిన భూ వ్యవహారాలను కొండా సురేఖ కుమార్తె వెలుగులోకి తీసుకురావడంతోనే ఆమెను మంత్రి పదవి నుంచి తొలగించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో భారీ స్థాయిలో భూ కబ్జాలు జరుగుతున్నాయని విమర్శించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో 22ఏ నిషేధిత భూముల బాధితులతో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. మంచిర్యాలలో ప్రారంభమైన భూ వ్యవహారం తీవ్రరూపం దాల్చడంతో దానిని కప్పిపుచ్చేందుకే కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 16 లక్షల ఎకరాలుగా ఉన్న 22ఏ నిషేధిత భూముల జాబితా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోటి 16 లక్షల ఎకరాలకు పెరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ గణాంకాలే రాష్ట్రంలో భూముల వ్యవహారం ఏ స్థాయిలో ఉందో వెల్లడిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో అవినీతిని ఓ మంత్రి కుమార్తె ప్రశ్నిస్తే.. ఆ మంత్రినే పదవి నుంచి తొలగించడం దారుణమని కేటీఆర్ అన్నారు. ఈ పరిణామం కాంగ్రెస్ ప్రభుత్వంలో పారదర్శకత ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తోందని విమర్శించారు. కొండా సురేఖను తొలగించడానికి దారితీసిన కారణాలపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## సెలబ్రిటీలకూ ఎస్ఐఆర్ నోటీసులు

**ప్రజానావ, హైదరాబాద్:** కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురు సినీ, క్రీడా రంగాల ప్రముఖులకు నోటీసులు జారీ అయినట్లు సమాచారం. నటి సమంత, నటుడు విజయ్ దేవరకొండ, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ తదితరులకు నోటీసులు అందినట్లు తెలుస్తోంది. ఓటర్ల జాబితాలో నమోదైన వివరాలను పరిశీలించి, వాటిని ధ్రువీకరించేందుకే ఈ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ జాబితాలో నటుడు మహేశ్‌బాబు, ఆయన భార్య నమ్రత, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నటుడు వెంకటేశ్, ఆయన కుమార్తెలు, నటుడు ఆనంద్ దేవరకొండతో పాటు క్రీడాకారులు సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్, పుల్లెల గోపీచంద్ పేర్లు ఉన్నట్లు సమాచారం. ఫార్మా రంగానికి చెందిన మురళీకృష్ణ ప్రసాద్ దివి, నటుడు రామ్‌చరణ్ సతీమణి ఉపాసన కొణిదెలకు కూడా నోటీసులు జారీ అయినట్లు తెలుస్తోంది. ఓటర్ల పేర్లు, తల్లిదండ్రుల పేర్లలో వ్యత్యాసాలు ఉండటం, పాత రికార్డుల్లోని వివరాలు ప్రస్తుత సమాచారంతో సరిపోలకపోవడం వంటి కారణాలతో నోటీసులు పంపినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో నిర్దిష్ట కారణాన్ని నోటీసుల్లో పేర్కొనలేదని సమాచారం. నోటీసులు అందుకున్న వారు వ్యక్తిగతంగా హాజరై వివరాలను ధ్రువీకరించుకోవచ్చని, అవసరమైన పత్రాలను సమర్పించి తప్పులను సరిదిద్దుకోవచ్చని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. వ్యక్తిగతంగా హాజరు కావడం సాధ్యం కానివారు తమ తరఫున ప్రతినిధులను పంపే అవకాశం కూడా కల్పించారు.అయితే నోటీసు జారీ చేసినంత మాత్రాన సంబంధిత వ్యక్తి ఓటు హక్కు రద్దయినట్లు కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇది కేవలం ఓటర్ల వివరాల ధ్రువీకరణ ప్రక్రియలో భాగమేనని చెబుతున్నారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా కర్ణాటకలో ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, జెరోధా వ్యవస్థాపకులు నితిన్, నిఖిల్ కామత్‌లకు కూడా నోటీసులు అందినట్లు సమాచారం.ఇదిలా ఉండగా.. ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న సీఎన్ఆర్ రావుకు ఎస్ఐఆర్ నోటీసు జారీ అయిందన్న వార్తలను ఎన్నికల సంఘం ఖండించింది.

## బొల్లారం ఆర్మీ ఆయుధాల చోరీ కేసు కొలిక్కి!

- హవల్దార్ మల్లేశ్ నిందితుడిగా గుర్తింపు
- ఆయుధాలను స్వగ్రామానికి తరలించి గుంత తీసి పాతిపెట్టినట్లు డీజీపీ వెల్లడి
- 12పిస్టల్స్, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్ చోరీ

**ప్రజానావ, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సికింద్రాబాద్ బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ కేసు దర్యాప్తులో కీలక పురోగతి సాధించినట్లు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ మేరకు మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఆగస్టు 31న మద్రాస్ రెజిమెంట్‌లోని 'బెల్ ఆఫ్ ఆర్మ్స్' నుంచి పిస్టల్స్, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్ చోరీకి గురయ్యాయని డీజీపీ తెలిపారు. బ్రిగేడియర్ ఫిర్యాదు మేరకు బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. మొత్తం 12 ఆయుధాలతో పాటు బుల్లెట్లు, బైనాక్యులర్ చోరీకి గురైనట్లు వివరించారు.ఆయుధాగారంలోకి ఎవరెవరికి ప్రవేశం ఉందన్న కోణంలో తొలుత విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఆర్మ్స్ కోట్ ఇన్‌ఛార్జి వినోద్‌కుమార్, ఆమ్యునిషన్ కోర్టు ఇన్‌ఛార్జి బల్లి మధులను అనుమానితులుగా విచారించినప్పటికీ.. వారిపై ఎలాంటి ఆధారాలు లభించలేదని చెప్పారు.

### మల్లేశ్ కదలికలపై అనుమానం

అనంతరం హవల్దార్లుగా పనిచేసిన ప్రకాశం జిల్లాకు చెందిన టీపీఎస్ రావు, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మల్లేశ్ అలియాస్ రాజును విచారించినట్లు డీజీపీ వెల్లడించారు. తమ వద్ద ఉన్న ఆధారాలతో మల్లేశ్ కదలికలపై ప్రశ్నించగా.. అతడు వాస్తవాలను వెల్లడించకుండా దాచిపెట్టినట్లు తెలిపారు.విచారణకు తొలుత పిలిచినా మల్లేశ్ హాజరుకాలేదని, అతడి ఫోన్ కాల్ లిస్ట్, వాట్సాప్ చాటింగ్‌లు డిలీట్ చేసినట్లు గుర్తించామని చెప్పారు. అనంతరం విచారణలో మల్లేశ్ ప్రవర్తనపై అనుమానం మరింత బలపడిందని డీజీపీ తెలిపారు. కేసు తీవ్రతను మల్లేశ్ భార్యకు వివరించడంతో ఆమె గట్టిగా ప్రశ్నించిందని.. దీంతో మల్లేశ్ చోరీకి సంబంధించిన విషయాలను అంగీకరించినట్లు డీజీపీ తెలిపారు. చోరీ చేసిన ఆయుధాలను నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని తన స్వగ్రామానికి తీసుకెళ్లి గుంత తీసి పాతిపెట్టినట్లు మల్లేశ్ వెల్లడించాడన్నారు.అతడు చూపించిన ప్రదేశం నుంచి చోరీకి గురైన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.

# మోదీతో పుతిన్ భేటీ

**న్యూఢిల్లీ:** భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ముందు ఇరువురు నేతలు సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత రెండు నెలల్లో మోదీ, పుతిన్ రెండుసార్లు భేటీ కావడం గమనార్హం. ద్వైపాక్షిక సంబంధాలతోపాటు వాణిజ్యం, ఇంధనం, అణు సహకారం, వ్యూహాత్మక ఖనిజాలు తదితర అంశాలపై చర్చకు అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 100 బిలియన్ అమెరికన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం సుమారు 60 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్యాన్ని మరో 40 బిలియన్ డాలర్ల మేర పెంచాల్సి ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే రానున్న నాలుగేళ్లలో వాణిజ్య వృద్ధి రెండంకెల స్థాయిలో కొనసాగాల్సి ఉంటుందని తెలిపారు.

### అణు, ఇంధన రంగాలపై దృష్టి

మోదీ–పుతిన్ భేటీలో పౌర అణు సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చ జరిగే అవకాశం ఉంది. ఇంధన సరఫరా, ఇంధన చక్రం, అణు విద్యుత్ ప్రాజెక్టులకు లైఫ్ సైకిల్ సపోర్ట్ వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశముందని సమాచారం. మొబిలిటీ రంగంలో సహకారాన్ని పెంచడం, రష్యాకు భారత నైపుణ్య కార్మికుల వలసలను ప్రోత్సహించడం, వ్యూహాత్మక ఖనిజాల రంగంలో భాగస్వామ్యాన్ని విస్తరించడం వంటి అంశాలపైనా ఇరువురు నేతలు దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది.జాయింట్ వెంచర్ ప్రాజెక్టుల ద్వారా ఎరువుల సరఫరాలో సహకారాన్ని మరింత పెంచే అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. భారత్‌లో 'ఇన్నోప్రోమ్' నిర్వహణతో ఇరుదేశాల పారిశ్రామిక, వాణిజ్య సంబంధాలకు వచ్చిన ఊపును కూడా నేతలు సమీక్షించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

### 'ఇన్నోప్రోమ్'తో పారిశ్రామిక బంధం

ప్రపంచవ్యాప్తంగా తయారీదారులు, కొనుగోలుదారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే పారిశ్రామిక ప్రదర్శనగా 'ఇన్నోప్రోమ్'కు గుర్తింపు ఉంది. అత్యాధునిక సాంకేతికతల ప్రదర్శన, అంతర్జాతీయ మార్కెట్లకు చేరువ, వ్యాపార భాగస్వామ్యాల ఏర్పాటుకు ఇది వేదికగా నిలుస్తుంది. భారత్‌లో ఇన్నోప్రోమ్ నిర్వహణతో రష్యాతో పారిశ్రామిక సహకారం మరింత విస్తరించే అవకాశాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా రైల్వే, టన్నెలింగ్, ఉక్కు రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఇది దోహదపడినట్లు భావిస్తున్నారు.భారత ఉత్పత్తులకు రష్యా మార్కెట్‌లో మరింత అవకాశాలు కల్పించడం, బీ2బీ భాగస్వామ్యాలను విస్తరించడం కూడా ఇరుదేశాల ఆర్థిక సహకారంలో కీలకంగా మారనుంది.

### బ్రిక్స్ సదస్సుపై ప్రపంచం చూపు

రెండు రోజుల పాటు జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సహా పలువురు దేశాధినేతలు హాజరుకానున్నారు. ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రానుండటం ఈ సదస్సుకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలు, వాణిజ్య ఉద్రిక్తతలు, ఆర్థిక సవాళ్లు కొనసాగుతున్న నేపథ్యంలో గ్లోబల్ సౌత్ దేశాల అభివృద్ధి ప్రాధాన్యతలను అంతర్జాతీయ వేదికపై బలంగా వినిపించేందుకు భారత్ బ్రిక్స్ సదస్సును వేదికగా చేసుకుంటోంది. ప్రపంచ జనాభాలో దాదాపు సగం వాటా కలిగిన బ్రిక్స్ కూటమి ఢిల్లీ సదస్సులో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.




### పుతిన్‌కు మోదీ కానుక

బ్రిక్స్ కూటమి శిఖరాగ్ర సదస్సు కోసం భారత్‌కు వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. భారత్ మండపానికి చేరుకున్న పుతిన్‌కు మోదీ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుతిన్‌కు ప్రత్యేక కానుకగా ప్రముఖ తమిళ కవి తిరువళ్లువర్ రచించిన 'తిరుక్కురళ్' గ్రంథాన్ని అందించారు. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్ ప్రచురించిన రష్యన్ భాషలోని అనువాద ప్రతిని ఆయనకు బహూకరించారు. ప్రాచీన తమిళ సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధ రచనల్లో 'తిరుక్కురళ్' ఒకటి. సుమారు రెండు వేల నుంచి రెండున్నర వేల సంవత్సరాల క్రితం తిరువళ్లువర్ ఈ గ్రంథాన్ని రచించినట్లు భావిస్తారు. ఇందులో నైతికత, మంచితనం, ప్రేమ, సంపద, సుపరిపాలన, మానవ ప్రవర్తన తదితర అంశాలను ప్రస్తావిస్తూ మొత్తం 1,330 ద్విపదలను పొందుపరిచారు. ఈ గ్రంథాన్ని 133 అధ్యాయాలుగా విభజించారు. ఒక్కో అధ్యాయంలో పది ద్విపదలు ఉంటాయి. వ్యక్తి ఎలా ప్రవర్తించాలి? ఇతరులతో ఎలా మెలగాలి? సమాజంలో బాధ్యతాయుతంగా ఎలా జీవించాలి? వంటి అంశాలతో పాటు జీవితం, మానవ సంబంధాలు, నైతిక విలువలపై ఇందులో లోతైన సందేశాలను అందించారు.



## ప్రభాస్‌కు కేటీఆర్ ప్రాంక్ కాల్

**ప్రజానావ, హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌కు సంబంధించిన ఓ సరదా వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవల కేటీఆర్ 'జెన్–జీ' యువతతో కలిసి పాల్గొన్న పాడ్‌కాస్ట్ కార్యక్రమంలో చోటుచేసుకున్న ఈ సరదా ఘటన నెటిజన్లను ఆకట్టుకుంటోంది. పాడ్‌కాస్ట్‌లో భాగంగా ఓ స్టార్ హీరోకు ఫోన్ చేయాలని యువత కేటీఆర్‌ను కోరారు. వారి కోరిక మేరకు కేటీఆర్ వెంటనే ప్రభాస్‌కు ఫోన్ చేశారు. అయితే.. కేటీఆర్ పక్కనే ఉన్న ఓ యువతి ఫోన్ తీసుకుని ప్రభాస్‌తో మాట్లాడుతూ.. ''ఈ ఫోన్ రోడ్డుపై దొరికింది'' అని సరదాగా చెప్పింది. ఆ మాటలు విన్న ప్రభాస్ వెంటనే కాల్ కట్ చేయడంతో పాడ్‌కాస్ట్ కార్యక్రమంలో ఒక్కసారిగా నవ్వులు వెల్లువెత్తాయి. అనంతరం కేటీఆర్ మళ్లీ ప్రభాస్‌కు ఫోన్ చేసి అసలు విషయం చెప్పారు. తాను ప్రస్తుతం యువతతో కలిసి పాడ్‌కాస్ట్ కార్యక్రమంలో ఉన్నానని, సరదాగా ప్రాంక్ చేశామని వివరించారు.కేటీఆర్, ప్రభాస్ మధ్య జరిగిన ఈ సరదా సంభాషణకు సంబంధించిన వీడియో క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ వీడియోపై నెటిజన్లు సరదాగా స్పందిస్తూ.. ఇద్దరు ప్రముఖుల మధ్య జరిగిన ఈ ఆహ్లాదకరమైన ఘటనను ఆస్వాదిస్తున్నారు.

# మోటర్లకు మీటర్లు పెట్టం

(మొదటి పేజీ తరువాయి)

సృష్టించవద్దని సూచించారు.రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు ఖర్చు చేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. 53 లక్షల గృహ విద్యుత్ వినియోగదారులకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కోసం మరో రూ.5 వేల కోట్లు వెచ్చిస్తున్నామని చెప్పారు. మొత్తంగా విద్యుత్ సబ్సిడీల రూపంలో ఏటా దాదాపు రూ.19 వేల కోట్లను ప్రభుత్వం భరిస్తోందన్నారు.ఈ నిధులను సోలరైజేషన్ వైపు మళ్లిస్తే ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గడంతోపాటు రైతులు విద్యుత్ విషయంలో స్వయంసమృద్ధి సాధించే అవకాశం ఉంటుందని భట్టి పేర్కొన్నారు. పగటిపూట మాత్రమే సోలార్ విద్యుత్ అందుబాటులో ఉండటంతో రాత్రివేళ అవసరాలను తీర్చేందుకు ఎంపిక చేసిన గ్రామాల్లో బ్యాటరీ స్టోరేజీ వ్యవస్థలతో మైక్రో గ్రిడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

### బ్యాటరీ ధరలు తగ్గితే వేగం

సోలార్ విద్యుత్‌తోపాటు బ్యాటరీ స్టోరేజీ ద్వారా గ్రామాలకు నిరంతర విద్యుత్ అందించే మైక్రో గ్రిడ్ ప్రాజెక్టులను పైలట్ ప్రాజెక్టులుగా చేపట్టామని భట్టి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అందించే వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్)తో మూడు దఫాలు టెండర్లు పిలిచినా.. బ్యాటరీ స్టోరేజీ వ్యయం అధికంగా ఉండటంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని తెలిపారు. భవిష్యత్తులో సాంకేతికత అభివృద్ధి చెంది బ్యాటరీల ధరలు తగ్గితే ఈ ప్రాజెక్టులు మరింత వేగంగా అమలు చేసే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా పర్యావరణహితమైన హరిత ఇంధన రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క తెలిపారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ–2025 వివరాలను వెల్లడించారు.2014లో రాష్ట్ర విద్యుత్ డిమాండ్ 15,497 మెగావాట్లుగా ఉండగా.. ఈ ఏడాది సెప్టెంబర్ 9 నాటికి 19,543 మెగావాట్లకు చేరిందని తెలిపారు. భవిష్యత్తులో డిమాండ్ 20 వేల నుంచి 21 వేల మెగావాట్లకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంప్రదాయ, సంప్రదాయేతర ఇంధన వనరులను సమన్వయం చేస్తూ నూతన ఇంధన విధానాన్ని రూపొందించినట్లు వివరించారు.ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద కేంద్రం 60 శాతం వరకు గ్రాంట్ అందిస్తుందని, రాష్ట్రం మిగతా 40 శాతం భరిస్తే విద్యుత్ వ్యవస్థలో మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయవచ్చని భట్టి తెలిపారు. విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినా ప్రస్తుత గ్రిడ్ వ్యవస్థ ద్వారా నాణ్యమైన సరఫరా కొనసాగిస్తున్నామని, గ్రిడ్ కుప్పకూలకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

### రైతులకు 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్

పీఎం–కుసుమ్ పథకం కింద రైతులకు 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని భట్టి వెల్లడించారు. రైతులు వ్యక్తిగతంగా 2 మెగావాట్ల వరకు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూరు ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా పూర్తి సోలరైజేషన్ చేపట్టి ప్రారంభించినట్లు తెలిపారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టులను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని భట్టి చెప్పారు. ఇటీవల కరీంనగర్‌లో ఓ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. మణుగూరులో సింగరేణి చేపట్టిన మీథేన్ గ్యాస్ ప్రాజెక్టు అధిక వ్యయంతో ఆర్థికంగా అనుకూలంగా లేకపోయిందని, అయితే కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం కొనసాగుతోందని వెల్లడించారు.

## 'కౌరవసభ'ను తలపించేలా దాడులు

**న్యూఢిల్లీ:** తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. ఈ ఘటనపై ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తోపాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు ఆమె ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలు దేశంలోనే ఎక్కడా లేని విధంగా 'కౌరవసభ'ను తలపించాయని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు నిరసన తెలిపే హక్కు ఉందని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తమను శాసనసభలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు. కనీసం మహిళా ప్రజాప్రతినిధులనైనా సభలోకి అనుమతించాలని కోరినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగారని, పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కారని ఆరోపించారు. ఈ తోపులాటలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కిందపడిపోయారని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసులు తమపై ఈ స్థాయిలో దాడికి పాల్పడ్డారని సబిత ఆరోపించారు. అసెంబ్లీలోనైనా ఈ ఘటనపై ప్రభుత్వం చర్చించి, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి సమాధానం ఇస్తారని భావించామని చెప్పారు. అయితే దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు. మహిళా ఎమ్మెల్యేలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ తప్పుడు ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు



నిరసనకారులను పంపడం వంటి పరిణామాల వెనుక కూడా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలే ఉన్నాయని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో తమకు న్యాయం జరగడం లేదనే జాతీయ కమిషన్లను ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. ఇది తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో అమలు చేస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సబిత విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మహిళా కానిస్టేబుళ్లను అడ్డుపెట్టుకుని 'శిఖండి రాజకీయాలు' చేస్తోందని ధ్వజమెత్తారు. 22ఎ పేరుతో భారీగా భూములను నిషేధిత జాబితాలో చేర్చి భూదందాకు తెరలేపారని ఆరోపించారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలపై కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు సమగ్ర వివరాలతో లేఖలు రాస్తున్నామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ కొందరు రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. వారి అప్పీల్‌ను విచారించిన ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించి పర్యావరణ నిబంధనలు, అనుమతుల విషయంలో లోపాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్లు ఉన్నప్పటికీ.. కేవలం 20 కిలోమీటర్ల పరిధిలోనే అధ్యయనం చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో మృగవాణి జాతీయ పార్కు కూడా ఉందని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లారు.ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిసరాల్లో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపైనా రిటైర్డ్ ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాణిజ్య సముదాయాల ఏర్పాటుతో పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మూసీ ప్రాజెక్టు వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని సమగ్రంగా అధ్యయనం చేసిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని వారు వాదించారు. పిటిషన్‌ను పరిశీలించిన ఎన్జీటీ.. ప్రతివాదిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన వివరాలను ట్రిబ్యునల్ ముందు సమర్పించాలని ఆదేశించింది. పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలపై ప్రభుత్వం తన వివరణను కూడా సమర్పించాల్సి ఉంటుంది.

### గతంలోనూ ఎన్జీటీని ఆశ్రయించిన కేసు

మూసీ ప్రాజెక్టుకు సంబంధించి గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేసింది. తాజాగా మరో పిటిషన్ దాఖలు కావడంతో మూసీ ప్రాజెక్టుపై న్యాయపరమైన అంశాలు మరోసారి తెరపైకి వచ్చాయి.రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై తదుపరి విచారణను ఎన్జీటీ అక్టోబర్ 16కు వాయిదా వేసింది. ఆ విచారణలో పిటిషనర్లు లేవనెత్తిన పర్యావరణ అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరాలు కీలకంగా మారనున్నాయి. ఇప్పటికే మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఎన్జీటీ తాజా నోటీసులు రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకున్నాయి.<

# ఏఐతో ఫోన్ కాల్స్‌పై నిఘా

**హైదరాబాద్:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం దుర్వినియోగం వైపు మళ్లుతున్న ఉదంతాలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఏఐ టూల్స్‌ను ఆయుధాల అభివృద్ధి వంటి కార్యకలాపాలకు వినియోగించిన ఘటనలు బయటపడగా.. తాజాగా పౌరులపై నిఘా కోసం కూడా ఏఐని ఉపయోగించినట్లు వెల్లడైంది. ఏఐ సంస్థ ఆంత్రోపిక్ తాజాగా విడుదల చేసిన 'డిటెక్టింగ్ అండ్ కౌంటరింగ్ మిస్ యూజ్ ఆఫ్ ఏఐ' నివేదికలో ఈ విషయాలను వెల్లడించింది.

### నిఘా వ్యవస్థ అభివృద్ధికి క్లాడ్

మాలి జాతీయ భద్రతా సంస్థల కోసం పనిచేస్తున్న ఓ కన్సల్టెంట్ సంస్థ 'క్లాడ్ ఏఐ'ను దుర్వినియోగం చేసినట్లు ఆంత్రోపిక్ పేర్కొంది. ఈ ఏడాది జనవరి నుంచి జులై మధ్య కాలంలో దేశవ్యాప్తంగా మొబైల్ ఆపరేటర్ల కాల్స్, సందేశాలను ట్రాక్ చేసేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో క్లాడ్‌ను ఉపయోగించినట్లు తెలిపింది.క్లాడ్ ఏఐకి నేరుగా కాల్స్, మెసేజ్‌లను ట్రాక్ చేసే సామర్థ్యం లేకపోయినప్పటికీ.. అందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడంలో ఈ టూల్ సహాయపడినట్లు ఆంత్రోపిక్ వెల్లడించింది. సాధారణంగా ఇంజినీరింగ్ బృందం చేపట్టాల్సిన పనిని ఏఐ సాయంతో పూర్తి చేసినట్లు పేర్కొంది.

### వ్యక్తిగత వివరాలతో ప్రొఫైల్స్

వ్యక్తుల లొకేషన్, జనాభా సంబంధిత వివరాలు, రాజకీయ అభిప్రాయాలు వంటి సమాచారాన్ని సేకరించి ప్రొఫైల్స్ రూపొందించేందుకు కూడా క్లాడ్‌ను ఉపయోగించినట్లు నివేదికలో పేర్కొన్నారు. దీంతో పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని నిఘా వ్యవస్థల్లోకి మళ్లించే ప్రమాదంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### చైనా, ఇరాన్‌లోనూ దుర్వినియోగం

చైనాలో సామాజిక మాధ్యమాల్లోని కంటెంట్, వార్తలను వడపోసేందుకు కూడా క్లాడ్‌ను ఉపయోగించినట్లు ఆంత్రోపిక్ గుర్తించింది. ఇరాన్‌కు చెందిన ప్రభుత్వ వర్గాలు నిఘాకు సంబంధించిన కార్యకలాపాల్లో ఈ టూల్‌ను వినియోగించినట్లు తెలిపింది.తమ వినియోగ నిబంధనలకు విరుద్ధంగా పౌర హక్కులకు భంగం కలిగించే విధంగా, నిఘా కార్యకలాపాల కోసం ఏఐని ఉపయోగించిన ఖాతాలను గుర్తించి నిషేధించినట్లు ఆంత్రోపిక్ వెల్లడించింది. ఏఐ సామర్థ్యాలు విస్తరిస్తున్న కొద్దీ వాటి దుర్వినియోగాన్ని అడ్డుకోవడం కూడా కీలకంగా మారుతోందని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

# ఢిల్లీ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్రం

- ప్రపంచం చూపు భారత్ వైపు!
- భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ సదస్సు
- పుతిన్, జిన్‌పింగ్ సహా 11 సభ్య దేశాల అగ్రనేతల హాజరు

**న్యూఢిల్లీ:** ప్రపంచ దేశాల చూపు ఇప్పుడు భారత్ వైపు మళ్లింది. అంతర్జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకమైన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని ఢిల్లీ ముస్తాబైంది. భారత్ అధ్యక్షతన శని, ఆదివారాల్లో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలు జరగనున్నాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సహా 11 సభ్య దేశాల అగ్రనేతలు ఈ సదస్సులో పాల్గొననున్నారు. ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలు, వాణిజ్య ఉద్రిక్తతలు, ఆర్థిక సవాళ్లు కొనసాగుతున్న నేపథ్యంలో గ్లోబల్ సౌత్ దేశాల అభివృద్ధి ప్రాధాన్యతలను అంతర్జాతీయ వేదికపై బలంగా వినిపించేందుకు భారత్ ఈ సదస్సును నిర్వహిస్తోంది. ప్రపంచ జనాభాలో సగానికిపైగా ప్రాతినిధ్యం వహిస్తున్న బ్రిక్స్ కూటమి.. ఢిల్లీ వేదికగా తీసుకునే నిర్ణయాలపై అంత ర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. ప్రపంచ ఆర్థిక అస్థిరత, ఉక్రెయిన్, పశ్చిమాసియా సంక్షోభాలు, అమెరికా వాణిజ్య విధానాలు, సుంకాల ప్రభావం వంటి అంశాల నేపథ్యంలో ఈ సదస్సుకు ప్రాధాన్యం పెరిగింది. 'స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే ఇతివృత్తంతో భారత్ సదస్సును నిర్వహిస్తోంది.గ్లోబల్ సౌత్ ఆర్థికాభివృద్ధికి బ్రిక్స్‌ను మరింత కీలక వేదికగా మార్చడంపై భారత్ దృష్టి సారించింది. ఆహార భద్రత, కృత్రిమ మేధ (ఏఐ), ఇంధన స్థిరత్వం, సరఫరా గొలుసు సమస్య లకు పరిష్కారాలు, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలు వంటి అంశాలపై అగ్రనేతలు చర్చించ నున్నారు. అయితే పశ్చిమాసియా సంక్షోభంపై సభ్య దేశాలైన ఇరాన్, యూఏఈ మధ్య భిన్నాభిప్రాయాలు ఉండటంతో.. ఈ అంశంపై ఉమ్మడి తీర్మానానికి ఏకాభిప్రాయం కుదురుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

## 22ఏ పేరుతో భూములకు 'భూ హారతి'



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా వివాదంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భూములను 22ఏ జాబితాలో చేర్చడం సాంకేతిక తప్పిదం కాదని, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా చేసిన చర్య అని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 22ఏ బాధితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'భూ భారతి' పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల భూములకు 'భూ హారతి' పడుతోందని విమర్శించా రు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనను పక్కనపెట్టి భూములను కాజేయడంపైనే దృష్టి సారించారని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన సుమారు 30 వేల ఎకరాల భూములపైనా ప్రభుత్వం కన్నేసిందని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ఫోన్ చేస్తే చాలని ప్రచారం చేసుకున్న ప్రభుత్వం.. బాధితులు నేరుగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసినా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఎద్దేవా చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న ప్రభుత్వం.. ప్రభావవంతమైన వ్యక్తులు నిర్మించిన అక్రమ కట్టడాల విషయంలో మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని హరీశ్‌రావు విమర్శించారు. 22ఏ నిషేధిత జాబితా విషయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి నైతిక బాధ్యత ఉంటే వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్య మంత్రి నివాసానికి సంబంధించిన భూమిని 22ఏ జాబితా నుంచి తొలగించినప్పుడు.. అదే జాబితాలో ఉన్న సామాన్యుల భూములు, ఇళ్లను ఎందుకు తొలగించడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. వెంటనే పేదలు, సామాన్యుల ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ వారి తరఫున ముందుండి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.



# ఖైరతాబాద్ మహాగణపతి తొలి పూజకు గవర్నర్‌కు ఆహ్వానం

**గణేశ్ ఉత్సవాలకు హాజరు కావాలని ఉత్సవ కమిటీ విజ్ఞప్తి**

**ప్రజానావ, హైదరాబాద్ :** ఖైరతాబాద్ మహాగణపతికి నిర్వహించే తొలి పూజకు హాజరై స్వామివారిని దర్శించుకుని పూజలు చేయాల్సిందిగా రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ ఆహ్వానించింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నేతృత్వంలోని గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు లోక్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాలకు సంబంధించిన వివరాలను వివరించారు. ఈ నెల 14 నుంచి 25వ తేదీ వరకు ఖైరతాబాద్‌లో గణేష్ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలి పూజ కార్యక్రమానికి గవర్నర్ హాజరై మహాగణపతికి ప్రత్యేక పూజలు చేయాలని కోరారు. కాగా, అంతకుముందు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ హైదరాబాద్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ డాక్టర్ వరుణ్ కిషోర్, తెలంగాణ క్షయవ్యాధి సంఘం ఉపాధ్యక్షుడు సుధీర్ ప్రసాద్ కూడా లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.



# బ్రిటిష్ రుచులకు హైదరాబాద్‌లో ప్రత్యేక ప్రచారం

**ఐదు నగరాల్లో 'గ్రేట్ ఫుడ్ ఫ్రమ్ గ్రేట్ బ్రిటన్' క్యాంపెయిన్**

**సెప్టెంబర్ నెలంతా ఉత్పత్తుల ప్రదర్శనలు, రుచి కార్యక్రమాలు**

**ప్రజానావ, హైదరాబాద్ :** భారతీయ వినియోగదారులకు బ్రిటిష్ ఆహార, పానీయాల ప్రత్యేకతలను పరిచయం చేసేందుకు 'గ్రేట్ ఫుడ్ ఫ్రమ్ గ్రేట్ బ్రిటన్' రిటైల్ క్యాంపెయిన్‌ను సెప్టెంబర్ నెలంతా ముంబయి, ఢిల్లీ, అహ్మదాబాద్, హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో నిర్వహిస్తున్నారు. యూకే ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఫుడ్ స్క్వేర్, ఫుడ్‌స్టోరీస్ స్టోర్లలో బ్రిటిష్ ఉత్పత్తుల ప్రదర్శనలు, శాంప్లింగ్, ప్రత్యక్ష వంట ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు, ఉత్పత్తుల కథనాలు నిర్వహించనున్నారు. చీజ్, బిస్కెట్లు, కుకీలు, జామ్‌లు, టీ, కాఫీ, చాక్లెట్లు తదితర ఉత్పత్తులను వినియోగదారులకు పరిచయం చేయడంతోపాటు వాటిని రోజువారీ భోజనం, టీ–టైమ్, పిక్నిక్‌లు, ప్రత్యేక సందర్భాల్లో వినియోగించే విధానాలను వివరించనున్నారు. యూకే–భారత్ వాణిజ్య ఒప్పందం అమల్లోకి రావడంతో అనేక ఆహార, పానీయ ఉత్పత్తుల లభ్యత మరింత సులభమైందని అధికారులు తెలిపారు. ఈ క్యాంపెయిన్ ద్వారా బ్రిటిష్ ఆహార సంస్కృతి, నాణ్యత, వైవిధ్యాన్ని భారతీయ వినియోగదారులకు చేరువ చేయడంతోపాటు ఇరు దేశాల మధ్య ఆహార, పానీయాల వాణిజ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.




# బెంగళూరు టెక్ సమ్మిట్-2026కు సన్నాహాలు

**'ఏఐ అండ్ బియాండ్' థీమ్‌తో నవంబర్ 17 నుంచి 19 వరకు**

**75కుపైగా దేశాల నుంచి టెక్ దిగ్గజాల రాక**

**ప్రజానావ, హైదరాబాద్ :** ఆసియాలోనే అతిపెద్ద టెక్నాలజీ ఈవెంట్లలో ఒకటైన బెంగళూరు టెక్ సమ్మిట్ 29వ ఎడిషన్‌ను నవంబర్ 17 నుంచి 19 వరకు బెంగళూరు అంతర్జాతీయ ఎగ్జిబిషన్ సెంటర్ (బీఐఈసీ)లో 'ఏఐ అండ్ బియాండ్' థీమ్‌తో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఇండస్ట్రీ ఇంటరాక్షన్ మీట్‌లో కర్ణాటక శాసనసభ్యుడు, కియోనిక్స్ చైర్మన్ శరత్‌కుమార్ బాచేగౌడ పాల్గొన్నారు. బీటీఎస్–2026లో 75కుపైగా దేశాల నుంచి 1,800కుపైగా ఎగ్జిబిటర్లు, 25 వేలకుపైగా ప్రతినిధులు, వెయ్యికిపైగా టెక్ స్టార్టప్‌లు, 60 వేలకుపైగా వ్యాపార సందర్శకులు పాల్గొననున్నారు. ఏఐ, డీప్‌టెక్, సెమీకండక్టర్లు, బయోటెక్, ఫిన్‌టెక్, స్పేస్‌టెక్, ఎలక్ట్రిక్ మొబిలిటీ తదితర రంగాలపై చర్చలు, ప్రదర్శనలు నిర్వహించనున్నారు. స్టార్టప్‌లకు ఇన్వెస్టర్లు, మెంటార్లతో అనుసంధానం కల్పించే 'ఫ్యూచర్ మేకర్స్' కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఎంబెడెడ్ సిస్టమ్స్‌పై దృష్టి సారించే 'ఎంబెడెడ్ వరల్డ్ ఇండియా'ను తొలిసారిగా భారత్‌లో నిర్వహించనుండటం ఈ సదస్సు ప్రత్యేకతగా నిలవనుంది.

# గవర్నర్ చేతుల మీదుగా 'గవర్నెన్స్ ఆఫ్ సెల్ఫ్' పుస్తకావిష్కరణ

- **75 పాఠాలతో నాయకత్వం, క్రమశిక్షణ, సేవా భావంపై పుస్తకం**
- **రచయిత అంబర్ అగర్వాల్**




**ప్రజానావ, హైదరాబాద్ :** నాయకత్వం, క్రమశిక్షణ, సేవా భావంపై రూపొందించిన 'గవర్నెన్స్ ఆఫ్ సెల్ఫ్: 75 లెసన్స్ ఇన్ లీడర్‌షిప్, డిసిప్లిన్ అండ్ సర్వీస్' పుస్తకాన్ని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఈ నెల 12న ఆవిష్కరించ నున్నారు. యువ న్యాయవాది అంబర్ అగర్వాల్ రచించిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం సాయంత్రం 6 గంటలకు హైటెక్‌సిటీలోని నోవోటెల్ హైదరాబాద్‌లో జరగనుంది. నాయకత్వ లక్షణాలు, వ్యక్తిగత క్రమశిక్షణ, సేవా దృక్పథాన్ని పెంపొందించుకునేందుకు ఉపయోగపడే 75 పాఠాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు.







# పర్యావరణహిత గణేష్ ప్రతిమలతో పండుగ జరుపుకోవాలి

- **జల కాలుష్య నివారణకు ప్రజలంతా సహకరించాలి**
- **గవర్నర్ శివప్రతాప్ శుక్లా**

**ప్రజానావ, హైదరాబాద్ :** గణేశ్ చతుర్థి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూనే పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. పర్యావరణహిత మట్టి గణేశ ప్రతిమలను వినియోగించి జల కాలుష్యాన్ని నివారించేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. గణేశ్ చతుర్థి సందర్భంగా తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణహిత వేడుకలను ప్రోత్సహించడంలో భాగంగా లోక్‌భవన్ ప్రాంగణంలో అధికారులు, ఉద్యోగులు, మీడియా ప్రతినిధులకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లాతో కలిసి మట్టి గణేశ ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 14 నుంచి గణేశ ప్రతిమల ప్రతిష్ఠాపన, పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వేడుకల్లో పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. నిమజ్జనం సందర్భంగా జల వనరులు కలుషితం కాకుండా పర్యావరణహిత పదార్థాలతో తయారు చేసిన మట్టి ప్రతిమలను వినియోగించాలని సూచించారు. మట్టి గణేశ ప్రతిమలు సహజసిద్ధంగా నీటిలో కరిగిపోవడం వల్ల జల కాలుష్యాన్ని తగ్గించేందుకు దోహదపడతాయని తెలిపారు. జల వనరులను కలుషితం చేసే పీవోపీ, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పర్యావరణహిత వేడుకలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని, మట్టి గణేశ ప్రతిమల ప్రాధాన్యం, జల సంరక్షణ, కాలుష్య నివారణ సందేశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో గవర్నర్ సంయుక్త కార్యదర్శి కొమందూరు శశికిరణాచారి తదితరులు పాల్గొన్నారు.





# మట్టి గణపతిని పూజిదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

- **జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే**
- **జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి మట్టి గణపతుల పంపిణీ**

**ప్రజానావ, సిరిసిల్ల :** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మట్టి గణపతులను పూజించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ మట్టి గణపతులను పంపిణీ చేసి, పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. గణేష్ మండపాల నిర్వహకులు పోలీస్ వారి సూచనలు సలహాలు పాటిస్తూ శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలకు సహకరించాలని, మండపాల నిర్వాహకులు తప్పకుండా పోలీస్ వారు సూచించిన గణేష్ పోర్టల్ లో మండపాల వివరాలు తప్పకుండా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ లు, ఆర్ఐ లు, ఎస్ఐ లు, ఆర్ఎస్ లు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**ప్రజానావ, గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ పంచాయితీ పరిధిలోని ఆమ్లెట్ గ్రామంలోని మక్తనాయక్ తండాలో శుక్రవారం సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. తండాకు చెందిన బానోత్ తిరుపతి నాయక్ కు రూ:60 వేల చెక్కు బానోత్ రేణుక రూ: 17 వేల చెక్కును వారికి అందజేశారు. చెక్క అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కూరేల్లి రామచంద్రం, ఎర్ర కిషన్ గౌడ్, ఎర్ర సంతోష్, పూజం భూమరాజం, నాంపల్లి పర్శరాములు, ప్రవీణ్ నాయక్, గోపి నాయక్, సాలవ్వలు పాల్గొన్నారు.



# అంబులెన్స్‌లో ప్రసవం

**ప్రజానావ, గంభీరావుపేట:** ప్రసవ వేదనతో బాధపడుతున్న గర్భిణి 108 అంబులెన్స్ వాహనంలో ప్రసవం జరిగిన సంఘటన శుక్రవారం గంభీరావుపేట మండలంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని రాజుపేట గ్రామంలో నివాసం ఉంటున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాందేవి అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. మహిళను ఆసుపత్రికి తరలిస్తున్న నేపథ్యంలో మార్గమధ్యలో నొప్పులు తీవ్రమవ్వడంతో పరిస్థితిని గమనించిన ఈఎంటి చెలిమెల సాయికృష్ణ, పైలట్ నాగరాజు సమయస్ఫూర్తితో వ్యవహరించి అంబులెన్సు వాహనంలోనే ప్రసవం చేశారు. రాందేవి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. అనంతరం వారికి మెరుగైన చికిత్స నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర పరిస్థితిలో సమయానుకూలంగా స్పందించి పురుడు పోసిన 108 సిబ్బందిని కుటుంబ సభ్యులు మరియు గ్రామస్థులు అభినందించారు.



# కనుల పండువగా ఖైరతాబాద్ గణేశుడి ఆగమన్

**భారీగా తరలివచ్చిన భక్తులు**

ఖైరతాబాద్‌లో మహాగణపతి ఆగమన్ వేడుకలను శుక్రవారం కన్నులపండువగా నిర్వహించారు. మహాగణపతిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో ఖైరతాబాద్ ప్రాంతం కిటకిటలాడింది. మేళతాళాలు, నృత్యాలతో ఉత్సవ నిర్వాహకులు గణనాథుడికి ఘన స్వాగతం పలికారు. మహాగణపతి ఆగమనంతో భక్తుల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గణేశ్ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. మహాగణపతి ఆగమనంతో ఖైరతాబాద్‌లో పండుగ వాతావరణం నెలకొంది.

– ప్రజానావ, హైదరాబాద్







# మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవు

**ప్రజానావ, వేములవాడ:** మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్షతో పాటు జరిమానా తప్పదని వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ హెచ్చరించారు. ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 182 మందిని లోక్ అదాలత్‌లో భాగంగా వేములవాడ కోర్టులో హాజరుపరచగా, మేజిస్ట్రేట్ మేఘన జరిమానాలు విధించారు. 52 మందికి రూ.4 వేలు, 26 మందికి రూ.5 వేలు, 45 మందికి రూ.3 వేలు, 59 మందికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలతో కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని, కేసులు నమోదైతే భవిష్యత్ ఉద్యోగ అవకాశాలు, పోలీస్ వెరిఫికేషన్‌లో ఇబ్బందులు తలెత్తవచ్చని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి సర్పంచ్ దంపతులు

- **ఐనవోలులో బర్ల వాణి, రవికుమార్ చేరిక**
- **అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి**

**ప్రజానావ, వరంగల్ :** ఐనవోలు మండలం కక్కిరాలపల్లి గ్రామ సర్పంచ్ బర్ల వాణి, రవికుమార్ దంపతులు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగ రాజు ఆధ్వర్యంలో వారు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ సర్పంచ్ దంపతులకు కాంగ్రెస్‌లోకి స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు బర్ల వాణి, రవికుమార్ తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిని సర్పంచ్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సర్పంచ్ దంపతులను అభినందించారు. కార్యక్రమంలో ఐనవోలు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నకరకంటి మోహన్‌గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రహదారిపై బలవంతపు వసూళ్లు

- **ట్రాన్స్‌జెండర్ అరెస్ట్**
- **వాహనాలు అడ్డుకుని ప్రయాణికుల నుంచి డబ్బులు డిమాండ్**




**ప్రజానావ, ఆదిలాబాద్ :** రహదారిపై వాహనాలను అడ్డకుని ప్రయాణికుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న ట్రాన్స్‌జెండర్ ను ఆదిలాబాద్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. జామ్డాపూర్ 'ఎక్స్' రోడ్డు వద్ద వాహనాలను అడ్డకుంటూ ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్న మెహెక్ ఖాన్ @ సోను (26)ను అదుపులోకి తీసుకున్నారు. రహదారులపై వాహనాలను అడ్డుకోవడం, ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తూ బలవంతంగా డబ్బులు వసూలు చేయడం చట్టవిరుద్ధమని పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.



# వానలు కరువు.. రబీపై గుబులు

సెప్టెంబర్ రెండో వారం నుంచి దేశవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలున్నా యని వాతావ రణ శాఖ అంచనా వేస్తుండగా, పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న ఎల్‌నినో ప్రభావం రబీ పంటలకు మరింత ముప్పుగా మారుతోంది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్ తదితర రాష్ట్రాల్లో సాధారణం కంటే 27 నుంచి 45 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైంది. సాధారణంగా అక్టోబర్‌లో ప్రారంభమయ్యే రబీ సాగుకు సెప్టెంబర్ వర్షాలు కీలకం. విత్తనాలు వేసే సమయం మారకపోయినా.. నేలలో తేమ తగ్గితే మొలకెత్తడం, పంట ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుంది.

ఎడిటోరియల్

ఈ ఏడాది వర్షాకాలం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో దేశ వ్యాప్తంగా రబీ సాగుపై ఆందోళన నెలకొంది. ఆయా ప్రాంతాల్లో అక్కడక్కడ చెదురుమదురు వర్షాలు కురిసినా.. పంటలకు అవసరమైన స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదు. సెప్టెంబర్ రెండో వారం నుంచి దేశవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలున్నా యని వాతావ రణ శాఖ అంచనా వేస్తుండగా, పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న ఎల్‌నినో ప్రభావం రబీ పంటలకు మరింత ముప్పుగా మారుతోంది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్ తదితర రాష్ట్రాల్లో సాధారణం కంటే 27 నుంచి 45 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైంది. సాధారణంగా అక్టోబర్‌లో ప్రారంభమయ్యే రబీ సాగుకు సెప్టెంబర్ వర్షాలు కీలకం. విత్తనాలు వేసే సమయం మారకపోయినా.. నేలలో తేమ తగ్గితే మొలకెత్తడం, పంట ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుంది. దేశంలోని 178 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గతేడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం తగ్గిపోయాయి. గతేడాది ఇదే సమయానికి 163.44 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు ఉండగా.. ప్రస్తుతం 130.55 బిలియన్ క్యూబిక్ మీటర్లకు పరిమితమైంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి వ్యవసాయ ధారిత రాష్ట్రాల్లో రిజర్వాయర్లలో నీరు లేకపోతే రబీ పంటలకు తొలి తడి అందించడం కష్టమవుతుంది. ముఖ్యంగా గోధుమ, ఆవాలు, శనగ వంటి పంటలు నీటి లభ్యత, నేలలోని తేమపై ఎక్కువగా ఆధారపడతాయి. మరోవైపు ఎల్‌నినో ప్రభావాన్ని ఇండియన్ ఓషన్ డైపోల్ కొంతవరకు తగ్గించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. 1997, 2023లో ఐఓడీ ప్రభావం ఎల్‌నినో తీవ్రతను కొంత తగ్గించినప్పటికీ.. రిజర్వాయర్లు, భూగర్భ జలాలను పూర్తిగా నింపేంత వర్షాలు కురుస్తాయా అన్నది అనుమానంగానే ఉంది. అక్టోబర్, నవంబర్‌లో నేలలో తేమ పెరగకపోతే రబీ సాగు విస్తీర్ణం, దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. ఫలితంగా గోధుమలు, పప్పుధా న్యాలు, వంటనూనెల సరఫరాపై ప్రభావం పడి నిత్యావసర ధరలు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మరో వైపు తెలంగాణలోనూ వర్షా భావ పరిస్థితులు అన్నదాతలను ఆందో ళనకు గురిచేస్తున్నాయి. వర్షాధార పంటల సాగును చాలావరకు తగ్గించినా.. బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేసిన వరి పంటలను కాపాడుకోవడం రైతులకు కష్టంగా మారింది. భూగర్భజలాలు పడిపోవడంతో బోర్లు వట్టిపోతుండగా.. కొత్త బోర్లు వేసినా నీరు పడని పరిస్థితులు అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో సాధారణంగా 1.32 కోట్ల ఎకరాల్లో సాగు నమోదవుతుండగా.. ఈ ఏడాది ఇప్పటివరకు 1.21 కోట్ల ఎకరాల్లో, అంటే సుమారు 92 శాతం మేర సాగైంది. ప్రధానంగా 66 లక్షల ఎకరాల్లో వరి సాగు నమోదవుతుండగా.. ఈసారి 52.81 లక్షల ఎకరాల్లోనే నాట్లు పడ్డా యి. పత్తి సాధారణ అంచనా 47 లక్షల ఎకరాలు కాగా 48 లక్షల ఎకరాల్లో సాగైంది. అపరాల సాగు కూడా 6.49 లక్షల ఎకరాల నుంచి 7.86 లక్షల ఎకరాలకు పెరిగింది. అయితే అధికంగా నీటిపై ఆధారపడే వరి సాగు దాదాపు 20 శాతం తగ్గింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 49 రోజులే వర్షాలు కురిశాయి. సాధారణ 598.9 మి.మీ. వర్షపాతానికి గాను 478.2 మి.మీ. మాత్రమే నమోదై 20 శాతం లోటు ఏర్పడింది. 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం ఉండగా.. 18 జిల్లాల్లో లోటు కొనసాగుతోంది. జనగామ, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూ డెం, జోగులాంబ గద్వాల, సూర్యాపేట, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో దాదాపు 40 శాతం లోటు నమోదైంది. గతేడాది ఆగస్టు చివరినాటికి 5.78 మీటర్ల లోతులో ఉన్న భూగర్భజల మట్టం ప్రస్తుతం 7.87 మీటర్లకు పడిపో యింది. సూర్యాపేట, వికారా బాద్ జిల్లాల్లో ఐదు మీటర్లకు పైగా, నారాయణపేట, మహబూబ్‌నగర్, మేడ్చల్‌లో నాలుగు మీటర్ల మేర నీటిమట్టం తగ్గింది. వరంగల్, సంగా రెడ్డి, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోనూ మూడు మీటర్ల మేర లోతుకు వెళ్లింది. చెరువుల్లో మిగిలిన కొద్దిపాటి నీటిని మోటార్లతో తోడుకుంటూ రైతులు పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. వర్షాలు మరో వారం, పది రోజులు కురవకపోతే ఇప్పటికే సాగులో ఉన్న పంటలను కాపాడుకోవడం కూడా కష్టమవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నా రు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే రబీ సాగు దెబ్బతినడంతోపాటు భవిష్యత్తులో సాగునీటి తోపాటు తాగునీటి సమస్య కూడా తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

గతేడాది ఆగస్టు చివరినాటికి 5.78 మీటర్ల లోతులో ఉన్న భూగర్భజల మట్టం ప్రస్తుతం 7.87 మీటర్లకు పడిపో యింది. సూర్యాపేట, వికారా బాద్ జిల్లాల్లో ఐదు మీటర్లకు పైగా, నారాయణపేట, మహబూబ్‌నగర్, మేడ్చల్‌లో నాలుగు మీటర్ల మేర నీటిమట్టం తగ్గింది. వరంగల్, సంగా రెడ్డి, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోనూ మూడు మీటర్ల మేర లోతుకు వెళ్లింది. చెరువుల్లో మిగిలిన కొద్దిపాటి నీటిని మోటార్లతో తోడుకుంటూ రైతులు పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. వర్షాలు మరో వారం, పది రోజులు కురవకపోతే ఇప్పటికే సాగులో ఉన్న పంటలను కాపాడుకోవడం కూడా కష్టమవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# వక్ఫ్ భూములపై అక్రమార్కుల కన్ను

- నర్సాపూర్‌లో రూ.కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం
- బస్టాండ్ సమీపంలోనూ ఆక్రమణలకు తెర

**ప్రజానావ, నిజామాబాద్ :** నర్సాపూర్‌లో రూ.కోట్ల విలువైన వక్ఫ్ భూములు యథేచ్ఛగా అన్యాక్రాంతమవుతు న్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో మసీదులు, దర్గాలు, ఖబ్రస్థాన్‌లకు చెందిన విలువైన భూములకు రక్షణ లేకుండా పోయింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వక్ఫ్ భూములను ప్లాట్లుగా మార్చి విక్రయించగా, మరికొన్ని చోట్ల అక్రమ నిర్మాణాలు వెలిశాయి. తాజాగా నర్సాపూర్ బస్టాండ్‌కు సమీపంలోని అత్యంత విలువైన స్థలంలో ఆక్రమణలకు తెరతీయడం చర్చనీయాంశంగా మారింది. పట్టణంలోని పలు సర్వే నంబర్లలో విలువైన వక్ఫ్ భూములు ఉండగా, వాటిలో చాలావరకు ఇప్పటికే అన్యాక్రాంతమై ఇతరుల స్వాధీనంలో ఉన్నట్లు తెలుస్తోంది.



అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అక్రమార్కులు భూములను ప్లాట్లుగా మార్చి విక్రయించినట్లు ఆరోపణలు న్నాయి. 2001లో నిర్వహించిన సర్వేలో పలు సర్వే నంబర్ల పరిధిలో మొత్తం 44.17 ఎకరాల వక్ఫ్ భూములు ఉన్నట్లు గుర్తించారు. ఇదిలా ఉండగా నర్సాపూర్ బస్టాండ్ నుంచి పట్టణంలోకి వెళ్లే మార్గంలోని వక్ఫ్ భూమిని ఆక్రమించేందుకు కొద్దిరోజులుగా పనులు సాగుతున్నాయి. అక్కడ డబ్బాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో గజం ధర రూ.50 వేలకు పైగానే పలుకుతున్న నేపథ్యంలో ఆక్రమణలను అడ్డుకోకపోతే మరిన్ని నిర్మాణాలు వెలిసే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవు తోంది. మెదక్–నర్సాపూర్–హైదరాబాద్ ప్రధాన జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న వక్ఫ్ ఆస్తుల్లోనూ పలు చోట్ల ఆక్రమణలు జరిగినట్లు తెలుస్తోంది. సంగారెడ్డి మార్గంలో సుమారు 22 ఎకరాల వ్యవసాయ భూమి కూడా వక్ఫ్ పరిధిలో ఉంది. స్థానిక షాదీఖానా, ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలోని సర్వే నంబర్లు 59, 60, 1, 2లలో సుమారు రెండెకరాల భూమి ఉండగా, ప్రస్తుతం అది ఖాళీగా ఉంది. దీనిపై అక్రమార్కుల కన్ను పడటంతో గతంలో కొందరు అక్కడ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నించగా అధికారులు అడ్డుకున్నారు. అయినప్పటికీ దొంగచాటుగా నిర్మాణాలను పూర్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఖాళీగా ఉన్న సుమారు రెండెకరాల భూమిని చదును చేసి ప్లాట్లుగా మార్చడమే కాకుండా విక్రయించినట్లు ఆరోప ణలు ఉన్నాయి. విలువైన వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని, ఇప్పటికే జరిగిన ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి భూములను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

## గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి

### మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

### కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్

**ప్రజానావ, సత్తుపల్లి :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ సూచించారు. సత్తుపల్లి ఏసీపీ కార్యాలయంలో గణేష్ మండపాల నిర్వాహకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మండపాలను పోలీసుశాఖ పోర్టల్‌లో ముందుగానే నమోదు చేసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ భద్రత, అగ్నిమాపక ఏర్పాట్లు, రద్దీ నియంత్రణపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిబంధ నలకు లోబడి మైక్‌లు మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. అసభ్యకర కార్యక్రమాలు నిర్వహించరాదని సూచించారు. ఊరేగింపులు, నిమజ్జనం సమయంలో పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను సజావుగా నిర్వహించాలని కోరారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్లు, పాయింట్ బుక్‌లను నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ తుమ్మలపల్లి శ్రీహరి, ఎస్సైలు కవిత, అశోక్, పోలీసు సిబ్బంది, గణేష్ మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- సింగరేణిలో క్రెచ్‌లు, పని ప్రదేశాల్లో సౌకర్యాలకు ప్రాధాన్యం
- జనక్ ప్రసాద్



**ప్రజానావ, కొత్తగూడెం :** సింగరేణి కొత్తగూడెం రీజియన్‌లో మహిళా కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందని ఆ సంఘం సెక్రటరీ జనరల్ డా. జనక్ ప్రసాద్ తెలిపారు. కొత్తగూడెంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో మహిళా అధ్యక్షురాలు శేషరత్నం అధ్యక్షతన రీజియన్ మహిళా కమిటీ సమావేశం నిర్వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన జనక్ ప్రసాద్ మహిళా కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్రెచ్‌ల ఏర్పాటు, క్యాడర్ స్కీమ్, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు, రెస్ట్‌రూమ్‌లు, హాఫ్‌డే లీవ్స్, మహిళలకు ప్రత్యేక సెలవులు తదితర అంశాలను మహిళా నాయకురాళ్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అన్ని ఏరియాల్లో వీలైనంత త్వరగా క్రెచ్‌లు ఏర్పాటు అయ్యేలా కృషి చేస్తామని జనక్ ప్రసాద్ హామీ ఇచ్చారు. మహిళా ఉద్యోగులు, కార్మికులకు మెరుగైన పని వాతావరణం, హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం కల్పించేలా యాజమా న్యంతో చర్చిస్తామని తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల వేతనాలు, బోనస్, మెడికల్ ఇన్సూరెన్స్ తదితర సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్మికుల సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు, పార్కులపై పన్నును యాజమాన్యమే చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పేతంబరం, మహిళా నాయకురాళ్లు లలిత లక్ష్మి , నాగ హేమరెడ్డి, స్వప్నరెడ్డి, శారద, లలితశ్రీ, కృష్ణవేణి, దివ్య, మానస, గౌతమి, అరుణతో పాటు సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, జనరల్ సెక్రటరీ వికాస్ కుమార్ యాదవ్, కొత్తగూడెం వైస్ ప్రెసిడెంట్ రజాక్, రీజినల్ జనరల్ సెక్రటరీ ఆల్బర్ట్, సెక్రటరీ అభిషేక్, పిట్ సెక్రటరీలు సంజిత్, సాగర్, సురేందర్ పాల్గొన్నారు.

# ఉల్లిధరలకు ఎల్‌నినో సెగ

- రెండు నెలల్లో మూడింతలు పెరిగిన ధర
- కిలో రూ.70కి చేరిన తెల్ల ఉల్లి
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నెలకు రూ.37.89 కోట్ల భారం

**ప్రజానావ, నల్లగొండ :** ఎల్‌నినో ప్రభావం నిత్యావసర సరకుల ధరలపైనా పడుతోంది. వంటింట్లో నిత్యం వినియో గించే ఉల్లిగడ్డ ధరలు ఒక్కసారిగా దడదడలాడుతున్నాయి. రెండు నెలల క్రితం కిలో రూ.20 పలికిన ఎర్ర ఉల్లి ప్రస్తుతం రూ.65కు, తెల్ల ఉల్లి రూ.70 వరకు చేరింది. దీంతో వినియోగదారులపై అదనపు భారం పడుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 414 మంది హోల్‌సేల్ వ్యాపారులు ఉండగా, ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి ఉల్లిగడ్డలను దిగుమతి చేసుకుంటున్నారు. ఒక్కో వ్యాపారి 10 నుంచి 20 టన్నుల వరకు దిగుమతి చేసుకుంటున్నప్పటికీ సరఫరా డిమాండ్‌కు అనుగుణంగా లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయి. రవాణా ఖర్చులు పెద్దగా పెరగకపోయినా వర్షాభావ పరిస్థితులతో మహారాష్ట్రలో ఉల్లి సాగు తగ్గడం, అక్కడే డిమాండ్ అధికంగా ఉండటంతో సరిపడా సరుకు లభించడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో కర్నూలు నుంచి హైదరాబాద్‌కు పెద్దఎత్తున ఉల్లి సరఫరా జరిగేది. సాగు సమృద్ధిగా ఉన్న సమయంలో రోజుకు 100 లారీల వరకు ఉల్లిగడ్డలు వచ్చేవని, ప్రస్తుతం ఐదు లోడ్‌లు కూడా రావడం



లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు. గతంలో ఉల్లి ధరలపై వరదల ప్రభావం కనిపించగా, ప్రస్తుతం ఎల్‌నినో కారణంగా సాగు తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. మరోవైపు ఉల్లి ధరల పెరుగుదలతో జిల్లాలోని కుటుంబాలపై నెలవారీ భారం గణనీయంగా పెరిగింది. ఉమ్మడి జిల్లాలో 10,82,708 కుటుంబాలు ఉండగా, ఒక్కో కుటుంబం నెలకు సగటున ఐదు కిలోల ఉల్లిని వినియోగిస్తున్నట్లు అంచనా. ఈ లెక్కన నెలకు 5,967.40 టన్నుల ఉల్లి వినియోగమవుతోంది. ప్రస్తుత ధర కిలో రూ.70 చొప్పున లెక్కిస్తే ఒక్కో కుటుంబం ఐదు కిలోలకు రూ.350 ఖర్చు చేస్తోంది. మొత్తం 10,82,708 కుటుంబాలు నెలకు ఉల్లి కోసం సుమారు రూ.37.89 కోట్లు వెచ్చిస్తున్నాయి. దీంతో ఉల్లి ధరల పెరుగుదల సామాన్య కుటుంబాల వంటింటి బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది.



# కల్వకుర్తి పంపులు ఆన్ చేయాలి

### కాంగ్రెస్ తీరుపై బీఆర్ఎస్ నేతల విమర్శలు

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో :** మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పరిధిలోని అన్ని పంపులను వెంటనే ఆన్ చేసి, 24 గంటల పాటు నిరంతరాయంగా నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, నాయకుడు డాక్టర్ కురువ విజయ్ కుమార్ తదితర బీఆర్ఎస్ శ్రేణులు రైతులతో కలిసి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం స్టేజ్–3 పంప్‌హౌస్, గుడిపల్లి రిజర్వాయర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి మాట్లాడారు. ఎల్ నినో విపత్తు ప్రభావంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం మొద్దునిద్ర వీడి వెంటనే అన్ని రిజర్వాయ ర్లను నింపి సాగునీరు అందిం చాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఉదాసీనత వల్ల శ్రీశైలం నుంచి ఏపీకి 70 టీఎంసీల నీరు తరలిపోతుంటే, తెలంగాణ కు మాత్రం 7 టీఎంసీలు కూడా రాలేదని ఆరోపిం చారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తయినా మిగతా 10 శాతం పనులు పూర్తి చేయకుండా నీటిని నింపడం లేదన్నారు. బీఆర్ఎస్ బృందం వస్తుందని తెలిసే అధికారులు మోటార్లు ఆన్ చేశారని గుడిపల్లి రైతులు నేతలకు వివరించారు.

# బ్యాంకు సమ్మెతో లావాదేవీలు బంద్

- విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలపై అవగాహన
- ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కార్యకలాపాలు స్తంభితం
- కష్టపడి చదివితే ఐఏఎస్, ఐపీఎస్, ఐఐటీ సాధ్యమే: పీఎస్ఎన్ మూర్తి

**ప్రజానావ, యాదాద్రి భువనగిరి :** అఖిల భారత బ్యాంకు యూనియన్ల సమాఖ్య పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు శుక్రవారం సమ్మె చేపట్టారు. ఉద్యోగులు విధులను బహిష్కరించడంతో బ్యాంకులు మూతపడి నగదు ఉపసంహరణలు, డిపాజిట్లు, ఇతర లావాదేవీలు నిలిచిపో యాయి. జిల్లాలో సుమారు 100కు పైగా ప్రభుత్వ రంగ బ్యాంకు శాఖల్లో కార్యకలాపాలు స్తంభించినట్లు సమాచారం. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అత్యవసర బ్యాంకు పనుల కోసం వచ్చిన వారు నిరాశతో వెనుదిరిగారు. ఇదిలా ఉండగా భువనగిరి సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలలో 'ఐఏఎస్ కావడం ఎలా?' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. క్రమశిక్షణ, పట్టుదలతో కష్టపడి చదివితే ఐఏఎస్, ఐపీఎస్, ఐఐటీ వంటి ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని ఐడీఏఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి విద్యార్థులకు సూచించారు. రోటరీ క్లబ్ భువనగిరి సెంట్రల్ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది ఎంఏ రహీం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మూర్తి మాట్లాడుతూ పేదరికం, కులం విజయానికి అడ్డంకులు కావని, జ్ఞానం, కష్టపడే తత్వమే లక్ష్యసాధనకు మార్గమని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ అదనపు ఎస్పీ ఎం.యాదయ్య, ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, అధ్యాపకులు చింతల సాయిబాబా, విద్యార్థులు పాల్గొన్నారు.



# నిమజ్జనానికి నీటి కష్టాలు

- వనరుల్లో అడుగంటిన నీటిమట్టాలు
- భారీ విగ్రహాలతో ఇబ్బందులు తప్పవని ఆందోళన

**ప్రజానావ, నల్లగొండ :** త్వరలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో వాడవాడలా గణేష్ మండపాల ఏర్పాటుకు యువత సిద్ధమవుతోంది. సాధారణంగా 3 నుంచి 9 రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించి, అనంతరం గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. ఎన్నో ప్రయాసలకోర్చి హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లి భారీ విగ్రహాలను తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. అయితే ఈసారి ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో నిమజ్జనానికి నీటి కష్టాలు తప్పేలా కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన జలాశయాలతో పాటు గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో చెరువులు పూర్తిగా ఎండిపోగా, వాగుల్లోనూ నీటి జాడ కనిపించడం లేదు. నవరాత్రుల అనంతరం నిమజ్జన వేడుకలను అట్టహాసంగా నిర్వహించే నిర్వాహకులకు ఈసారి గణనాథుడిని ఎక్కడ నిమజ్జనం చేయాలన్న ప్రశ్న ఎదురవుతోంది. అసలే నీటి నిల్వలు తక్కువగా ఉన్న జలాశయాలు, చెరువుల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన విగ్రహా లను నిమజ్జనం చేస్తే ఉన్న నీరు సైతం కలుషిత మయ్యే ప్రమాదం ఉందని పర్యావరణవేత్తలు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల తాగునీటి అవసరా లకు ఆ నీటిని వినియోగించడం మరింత కష్టతరంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మట్టి విగ్రహాలను ఏర్పాటు చేస్తే ప్రతిష్ఠించిన ప్రదేశంలోనే నీటిని చల్లి నిమజ్జనం చేసి, అనంతరం ఆ మట్టిని పెరటితోటల పెంపకానికి వినియోగిం చుకోవచ్చని పలువురు సూచిస్తున్నారు. గతంలో కరవు పరిస్థితుల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్న వనరుల్లో భారీ గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసినప్పుడు అవి పూర్తిగా మునగక ఇబ్బందికర పరిస్థితులు తలెత్తిన సందర్భాలు ఉన్నాయి. ఈసారి అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా భారీ విగ్రహాలకు బదులుగా చిన్న మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యావర ణహితంగా ఉత్సవాలను నిర్వ హించడం మేలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## అటవీ అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

- పర్యావరణ పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన సిబ్బంది సేవలను స్మరించుకోవాలి: కలెక్టర్ అంకిత్

**ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం :** పర్యావరణ పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సేవలు, త్యాగాలు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్స వాన్ని పురస్కరించుకుని శుక్రవారం కొత్తగూడెం–ఇల్లందు క్రాస్‌రోడ్స్‌లోని చలమల శ్రీనివాసరావు మెమోరియల్ సెంట్రల్ పార్క్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో జాతీయ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ అంకిత్.. అమరవీరుడు చలమల శ్రీనివాసరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అటవీ సంపదను కాపాడే క్రమంలో ఎంతోమంది అటవీ శాఖ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని తెలిపా రు. వారి త్యాగాలను స్మరించుకోవడంతో పాటు సేవలను భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విధి నిర్వహణలో ప్రాణా లు కోల్పోయిన అటవీ శాఖ సిబ్బంది త్యాగాలను సమాజం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా అటవీ అధికారి విక్రమ్ సింగ్, అటవీ శాఖ అధికారులు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఇతర అటవీ శాఖ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షుడిగా నర్సింగోజు పండరి చారి
- ఉపాధ్యక్షుడిగా దుంపేటి కమలాకర్

ప్రజానావ, వేములవాడ : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం సంకేపల్లి గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా నర్సింగోజు పండరి చారి, ఉపాధ్యక్షుడిగా దుంపేటి కమలాకర్, కోశాధికారిగా దుంపేటి రాహుల్ చారి, ముఖ్య సలహాదారులుగా నర్సింగోజు రాంకిషన్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నర్సింగోజు పండరి చారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ కుల అభ్యున్నతితో పాటు సంఘం శ్రేయస్సు కోసం తన సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. సంఘ సభ్యుల ఐక్యతతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతన కార్యవర్గానికి కుల బంధువులు, మహిళలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, కుల బంధువులు, మహిళలు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ పనులు వేగవంతం చేయాలి

- విస్తరణ, బద్ది పోచమ్మ ఆలయం
- 80 ఫీట్ల రోడ్డు పనులపై కలెక్టర్ సమీక్ష



ప్రజానావ, వేములవాడ : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్ ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులతో పాటు బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణం, 80 ఫీట్ల రోడ్డు పనులను పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆమె నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం ఐడీఓసీలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణం, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## పండుగల రద్దీకి ప్రత్యేక రైళ్లు

- సెప్టెంబర్ 12, 13న సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్, సిర్పూర్-హైదరాబాద్ మధ్య జనసాధారణ్ రైళ్లు



ప్రజానావ, పెద్దపల్లి : పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్, సిర్పూర్ కాగజ్‌నగర్–హైదరాబాద్ మధ్య జనసాధారణ్ (అన్‌రిజర్వ్‌డ్) ప్రత్యేక రైళ్లను నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే అనుమతించిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. వీటి ద్వారా సిర్పూర్ కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ రోడ్, బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట, కాజీపేట, జనగాం, భువనగిరి, చర్లపల్లి, హైదరాబాద్ ప్రాంతాల ప్రయాణికులకు ప్రయోజనం కలగనుంది. పండుగల సమయంలో సామాన్య ప్రయాణికులకు రైలు ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు ప్రత్యేక రైళ్లు, ఇతర రైల్వే సదుపాయాల కల్పన కోసం తన వంతు కృషి కొనసాగిస్తానని ఎంపీ తెలిపారు. ప్రత్యేక రైళ్లకు అనుమతి ఇచ్చిన దక్షిణ మధ్య రైల్వే అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా ముందస్తు హిందీ దినోత్సవ వేడుకలు



ప్రజానావ, గంభీరావుపేట: గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తు హిందీ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హిందీ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు హిందీ భాష ప్రాముఖ్యత, విశిష్టత, గొప్పదనం గూర్చి వివరించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన, హిందీ క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలను అభినందించారు. హిందీ ఉపాధ్యాయురాలు జడల విజయశ్రీ నీ ఘనంగా సన్మానించారు. గారిని శాలువాలు, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కు చెందిన ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందము విద్యార్థులు పాల్గొన్నారు.







## మగ్గంపై మహాద్భుత సృష్టి

ప్రజానావ, సిరిసిల్ల : చేనేత మగ్గంపై వినూత్న కళాఖండాలను ఆవిష్కరిస్తున్న ప్రముఖ చేనేత కళాకారుడు వెల్ది హరి ప్రసాద్ మరో అద్భుతాన్ని రూపొందించారు. గుంటూరుకు చెందిన రత్నకుమారి–కోటేశ్వరరావు ప్రత్యేక ఆర్డర్ మేరకు 45 రోజులపాటు శ్రమించి వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దివ్య చరిత్రను పట్టుచీరపై ఆవిష్కరించారు. సుమారు 7 మీటర్ల పొడవైన ఈ చీరలో 102 మంది ఋషుల పేర్లు, 102 గోత్రనామాలు, 25 చారిత్రక చిత్రాలను చేనేత మగ్గంపై నేశారు. పూర్తిగా పట్టుదారంతో పాటు 2 గ్రాముల బంగారు జరి ఉపయోగించి ఈ కళాఖండాన్ని రూపొందించారు. భక్తి, చరిత్ర, ఆధ్యాత్మికత, భారతీయ సంస్కృతి, చేనేత నైపుణ్యాల సమ్మేళనంగా ఈ చీర నిలిచింది.

### రికార్డులతో ప్రత్యేక గుర్తింపు

హరి ప్రసాద్ గతంలో కేవలం 170 నిమిషాల్లో అగ్గిపెట్టెలో ఇమిడే చీరను నేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. తాజాగా వాసవి అమ్మవారి చరిత్ర, ఋషుల పేర్లు, గోత్రనామాలు, చారిత్రక చిత్రాలను ఒకే చీరపై మగ్గంతో ఆవిష్కరించి మరోసారి తన సృజనాత్మకతను చాటుకున్నారు. చరిత్రను చదవడమే కాదు.. చీరగా నేయవచ్చని ఈ కళాఖండం నిరూపిస్తుంది.

## గల్ఫ్ ఉద్యోగాల పేరుతో హైటెక్ మోసం

- రీల్స్, వాట్సాప్, ఇన్‌స్టా, టెలిగ్రామ్ ద్వారా నిరుద్యోగులకు వల
- నకిలీ వీసాలతో లక్షల్లో దోపిడీ

ప్రజానావ, నిజామాబాద్ : ఊరూరా తిరిగి యువతకు ఉద్యోగాలు ఎరవేసి మోసం చేయడం ఒకప్పటి మాట. ఇప్పుడు గల్ఫ్ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న నకిలీ ముఠాలు హైటెక్ పంథాను ఎంచుకున్నాయి. ఆకట్టుకునే రీల్స్, పోస్టులతో సోషల్ మీడియా వేదికగా నిరుద్యోగులకు వల విసురుతున్నాయి. వాట్సాప్ గ్రూపులు, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ తదితర వేదికల్లో భారీ వేతనాలతో ఉద్యోగాలంటూ ఊరించి, విజిటింగ్, టూరిస్ట్ వీసాలు, నకిలీ వీసాలు అంటగట్టి బాధితులను విదేశాలకు పంపించి నట్టేట ముంచుతున్నాయి. నెలకు రూ.1.50 లక్షల జీతం, ఉచిత వీసా, భోజనం, వసతి అంటూ నిరుద్యోగులను ఆకర్షిస్తున్న ఏజెంట్లు.. ప్రాసెసింగ్, మెడికల్, వీసా ఫీజుల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. అనంతరం ముందుగా విజిటింగ్ లేదా టూరిస్ట్ వీసాపై విదేశాలకు వెళ్లాలని, అక్కడి ఏజెంట్లు ఎంప్లాయిమెంట్ వీసా ఇప్పిస్తారని నమ్మిస్తున్నారు. బాధితులు విదేశాలకు వెళ్లిన తర్వాత నకిలీ ఏజెంట్లు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేయడంతో వారు ఉద్యోగాలు లేక, వీసా గడువు ముగిసి జరిమానాలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరికొందరు జైలు పాలవుతుండగా, పలువురు లేబర్ క్యాంపుల్లో చిక్కుకుని తిండి, పాస్‌పోర్టులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదేమిటని బాధితులు నిలదీస్తే ఎంతో కొంత డబ్బు తిరిగి ఇచ్చి చేతులు దులుపుకొంటున్న నకిలీ ఏజెంట్లు కూడా ఉన్నారు. జిల్లాలో లైసెన్స్‌డ్ ఏజెంట్లు పదిలోపే ఉండగా, మరో 680 మంది నకిలీ ఏజెంట్లు రీల్స్, పోస్టుల ద్వారా యువతను ఆకర్షిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గల్ఫ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆన్‌లైన్ ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న వారిపై సైబర్ క్రైమ్ లేదా డయల్ 112కు ఫిర్యాదు చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య సూచించారు. నకిలీ ఏజెంట్లకు కార్యాలయాలు, ఇళ్లు అద్దెకు ఇచ్చే వారిపైనా కేసుల్లో బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. విదేశీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ గుర్తించిన రిజిస్టర్డ్ రిక్రూటింగ్ ఏజెన్సీల ద్వారానే వెళ్లాలి. ఏజెంట్‌కు రిక్రూట్‌మెంట్ లైసెన్స్ నంబర్ ఉందో లేదో 'ఈ మైగ్రేట్' పోర్టల్‌లో తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలి. పాస్‌పోర్టు వెనుక 'నాన్ మెట్రిక్' స్టాంప్ ఉన్నవారు విదేశాలకు వెళ్లే ముందు నిబంధనల ప్రకారం 'ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్' అనుమతి పొందాలి. పర్మిట్ లేదా ఎంప్లాయిమెంట్ వీసా లేకుండా టూరిస్ట్, విజిటింగ్ వీసాలపై విదేశాలకు వెళ్లి ఉద్యోగం చేయడం చట్టరీత్యా నేరమని, వీసా నిబంధనలపై పూర్తిస్థాయి అవగాహనతోనే విదేశీ ప్రయాణం చేయాలని అధికారులు సూచిస్తున్నారు.





## పైడిపల్లి ప్రభుత్వ పాఠశాలకు 50 బెంచీలు

- విద్యార్థులకు మెరుగైన వసతులే లక్ష్యం
- ఎంపీ గడ్డం వంశీకృష్ణ

ప్రజానావ, వెల్గటూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా వెల్గటూరు మండలం పైడిపల్లి ప్రభుత్వ పాఠశాలకు విశాఖ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 50 బెంచీలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై బెంచీలను పాఠశాల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించడం ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులను గుర్తించి వాటి కల్పనకు తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత 35 ఏళ్లుగా తమ కుటుంబం ప్రజాసేవలో కొనసాగుతోందని, అదే సేవా స్ఫూర్తితో భవిష్యత్తులోనూ ప్రజలకు అండగా నిలుస్తామని చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో బోర్‌వెల్స్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు ఉపయోగపడే మరిన్ని సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ''మన పిల్లలకు అందించే మెరుగైన విద్య, సౌకర్యాలే వారి భవిష్యత్తుకు బలమైన పునాది'' అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. పాఠశాలకు 50 బెంచీలు అందించిన విశాఖ చారిటబుల్ ట్రస్టు సేవలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రెండో రోజుకు చేరిన కాంట్రాక్ట్ కార్మికుల నిరాహార దీక్ష

**హైపవర్ కమిటీ వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలి: మద్దెల శ్రీనివాస్**



ప్రజానావ, గోదావరిఖని : సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం, హైపవర్ కమిటీ (హెచ్‌పీసీ) వేతనాల అమలు, సంపూర్ణ ఉద్యోగ భద్రత తదితర డిమాండ్ల సాధన కోసం తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం (టీసీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోదావరిఖని ఆర్జీ–1 జీఎం కార్యాలయం ఎదుట చేపట్టిన మహా నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న ఈ దీక్షకు గోదావరిఖనితో పాటు వివిధ ఏరియాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు స్వచ్ఛందంగా తరలివచ్చి సంఘీభావం తెలిపారు. ఇదిలా ఉండగా, ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సభలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం హర్షణీయమని టీసీకేఎస్ నాయకులు పేర్కొన్నారు. కార్మికుల హక్కుల కోసం గళమెత్తిన ఎమ్మెల్యేకు సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి పరిధిలోని 11 ఏరియాలకు చెందిన ఎమ్మెల్యేలు కూడా కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తి హెచ్‌పీసీ వేతనాలు, ఇతర హక్కులు సాధించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నప్పటికీ కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు, తగిన వేతనాలు అందడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల చదువులు, కుటుంబ పోషణకు ప్రస్తుత వేతనాలు సరిపోవడం లేదని, దశాబ్దాలుగా కాంట్రాక్ట్ కార్మికులు అణచివేతకు గురవుతున్నారని పేర్కొన్నారు. కోల్ వేజ్ బోర్డు, హైపవర్ కమిటీ సిఫార్సు చేసిన వేతనాలను సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే అమలు చేయాలని, పర్మినెంట్ కార్మికులతో సమానంగా గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు రూ.40 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం లేదా తగిన జీవన భృతి కల్పించాలని కోరారు. నర్సరీలు, పార్కుల్లో కాలం చెల్లిన టెండర్ల విధానాన్ని మార్చి కార్మికులకు ఉపాధిలో అంతరాయం లేకుండా చూడాలని, ప్రతి కాంట్రాక్ట్ కార్మికుడికి యాజమాన్యం అధికారిక గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, ప్రమాద బీమా వంటి సౌకర్యాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. సివిల్ విభాగంలోని మేసన్లు, కార్పెంటర్లు, ప్లంబర్లు, హెల్పర్ల వేతన సమస్యలు పరిష్కరించాలని, ఓసీపీ విభాగాల్లో పనిచేస్తున్న వాల్వో డ్రైవర్లు, మైన్ బెల్ట్ క్లీనింగ్ కార్మికులు, బ్లాస్టింగ్ సిబ్బందికి రక్షణ పరికరాలతో పాటు సరైన వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. వైద్య, ఆసుపత్రి విభాగాల్లోని స్టాఫ్ నర్సులు, వార్డ్‌బాయ్‌లు, ఆయాలు, శానిటేషన్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సెక్యూరిటీ సిబ్బందికి వేతన రక్షణ కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇతర శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పీఆర్సీ అమలుకు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ సింగరేణి యాజమాన్యం మాత్రం కాంట్రాక్టర్ల ద్వారా అరకొర వేతనాలు చెల్లిస్తూ కార్మికులపై భారం మోపుతోందని టీసీకేఎస్ నాయకులు ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం అనే సుప్రీంకోర్టు తీర్పులు, కార్మిక చట్టాలను అమలు చేయడంలో యాజమాన్యం విఫలమవుతోందని విమర్శించారు. తక్కువ రేట్లకు టెండర్లు దక్కించుకునే కాంట్రాక్టర్ల కారణంగా కార్మికులకు సరైన వేతనాలు అందకపోవడంతో పాటు కనీస సౌకర్యాలు కూడా కరువవుతున్నాయని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులు భారం కాదని, సింగరేణి సంస్థకు నిజమైన బలమని మద్దెల శ్రీనివాస్ పేర్కొన్నారు. హక్కుల సాధన కోసం చేపట్టిన నిరాహార దీక్షకు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో కార్మికులు తరలివచ్చి ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పోరాటం ద్వారానే హక్కులు సాధించుకోవచ్చని, కార్మికులంతా ఐక్యంగా కదిలి న్యాయమైన డిమాండ్లను సాధించుకోవాలని కోరారు.

## సిరిసిల్లలో రైస్ మిల్లర్ల ఆందోళన, కలెక్టరేట్ ఎదుట ధర్నా

**సీఎంఆర్ అగ్రిమెంట్ సవరణ, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్.**

ప్రజానావ, సిరిసిల్ల : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాకు చెందిన రైస్ మిల్లర్లు శుక్రవారం సిరిసిల్లలో ఆందోళన చేపట్టారు. సిరిసిల్ల పట్టణంలోని కళ్యాణలక్ష్మి గార్డెన్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించిన మిల్లర్లు.. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పబ్బ నాగరాజు మాట్లాడుతూ.. సీఎంఆర్ అగ్రిమెంట్‌ను ఇరుపక్షాలకు ఆమోదయోగ్యంగా ఉండేలా రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైస్ మిల్లులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆకస్మిక దాడులను నిలిపివేసి, మిల్లర్లతో ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. 2014 నుంచి పెండింగ్‌లో ఉన్న సివిల్ సప్లై మిల్లింగ్, రవాణా, డ్రయల్, కస్టోడియల్ చార్జీలను వెంటనే చెల్లించాలని కోరారు. పెనాల్టీ విధించిన మిల్లులకు బకాయిలను నాలుగు విడతల్లో చెల్లించే అవకాశం కల్పించాలని, ఎఫ్‌సీఐ కఠిన నిబంధనలను కొంతమేర సడలించాలని ప్రభుత్వాన్ని కోరారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ లో రైస్ మిల్లర్లు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో చేపూరి నాగరాజు, గరిపెల్లి ప్రభాకర్, రాజిరెడ్డి, శ్రీనివాస్, అనిల్‌రావు, వంశీధర్‌రావు, సత్యంరావు తదితరులు పాల్గొన్నారు.





## సిరిసిల్ల మార్కెట్‌లో దారుణ పరిస్థితులు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల పాలవుతున్న ప్రజలు, నియంత్రణ లేని ట్రాఫిక్, ప్రజల జేబులకు తూట్లు

ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పాత మార్కెట్‌లో ప్రస్తుతం పరిస్థితి చాలా దారుణంగా మారింది. మార్కెట్‌లోని వ్యాపారులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ సంబంధిత మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఈ సమస్యపై దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ఉదయం 10 గంటల నుంచే మార్కెట్ మొత్తం ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోతోంది. ఎవరికి ఇష్టం వచ్చిన చోట రోడ్డుపై కూరగాయలు విక్రయించడం, వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపివేయడంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మరో రెండు రోజుల్లో గణేష్ పండుగ ఉండటంతో మార్కెట్‌కు వచ్చే ప్రజల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రతి పండుగ సమయంలో మార్కెట్ ప్రాంతంలో ప్రజల డబ్బులు, పర్సులు, సెల్‌ఫోన్లు పోతున్న ఘటనలు కూడా జరుగుతున్నాయి. అయినప్పటికీ ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అంటున్నారు. మార్కెట్‌లోనే స్లాబ్ కింద సుమారు 200 మంది కూర్చొని వ్యాపారం చేసుకునే సౌకర్యం ఉంది. రైతు బజార్‌లో పార్కింగ్, బాత్రూమ్ తదితర సౌకర్యాలు కూడా ఉన్నాయి. ప్రజల సౌకర్యం కోసం కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన ఈ సదుపాయాలను ఉపయోగించకుండా రోడ్లపైనే వ్యాపారం చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. అధికారులు ఒక్కసారి మార్కెట్ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, రోడ్లపై వ్యాపారాలను క్రమబద్ధీకరించి, ట్రాఫిక్ సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు. ప్రజల జేబుల్లోని డబ్బులు, పర్సులు, సెల్‌ఫోన్లు పోయిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే చర్యలు తీసుకుని ప్రజలకు, మార్కెట్ వ్యాపారులకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. సిరిసిల్ల మార్కెట్ పరిస్థితిపై ఇకనైనా అధికారులు స్పందిస్తారని ఆశిస్తున్నారు.

## ధర్మపురి ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

**గోదావరి పుష్కరాల దృష్ట్యా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం: ఎంపీ వంశీకృష్ణ**

ప్రజానావ, ధర్మపురి : పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ధర్మపురిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శంకుస్థాపన చేసిన ఆలయ అభివృద్ధి పనులను ఎంపీ పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ధర్మపురికి తరలివచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు గడ్డం వంశీకృష్ణ తెలిపారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఇతర ఆలయాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.



# ఆస్ట్రేలియా విద్యార్థి వీసాలకు భారీ కోత

- దశాబ్దంలో గరిష్ఠానికి తిరస్కరణ రేటు
- భారతీయ విద్యార్థుల వీసాల్లో 40 శాతం తిరస్కరణ




**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ విద్యార్థులకు జారీ చేసే స్టూడెంట్ వీసాలపై ఆస్ట్రేలియా కఠినంగా వ్యవహరిస్తోంది. దీంతో భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఆస్ట్రేలియా హోంశాఖ గణాంకాల ప్రకారం 2026 జూన్‌లో 24.2 శాతం స్టూడెంట్ వీసాలను తిరస్కరించింది. 2016 జూన్‌లో 7.9 శాతంగా ఉన్న తిరస్కరణ రేటు పదేళ్లలో అత్యధిక స్థాయికి చేరింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో నేపాల్, భారత్‌కు చెందిన విద్యార్థుల వీసాల తిరస్కరణ రేటు మరింత అధికంగా నమోదైంది. నేపాల్ విద్యార్థులకు సంబంధించిన 51 శాతం వీసా దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా, భారతీయ విద్యార్థుల దరఖాస్తుల్లో 40 శాతం తిరస్కరించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అదే సమయంలో చైనా విద్యార్థుల వీసా తిరస్కరణ రేటు 5.8 శాతంగా ఉంది. వలసల అవసరాలకు అనుగుణంగా దరఖాస్తులను పరిశీలిస్తున్నామని ఆస్ట్రేలియా ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, విద్యార్థి వీసాలపై స్క్రూటినీ గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వీసా తిరస్కరణకు గురైన విద్యార్థులు ముందుగా రిఫ్యూజల్ లెటర్‌ను పూర్తిగా పరిశీలించి, అందులో పేర్కొన్న కారణాలను విశ్లేషించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తిరస్కరణకు చట్టపరమైన కారణాలు లేకపోతే, అవసరమైన మార్పులు చేసుకుని మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. అలాగే అడ్మినిస్ట్రేటివ్ రివ్యూ ట్రిబ్యునల్ ద్వారా తమ వీసా దరఖాస్తును మరోసారి సమీక్షకు తీసుకెళ్లే అవకాశం కూడా విద్యార్థులకు ఉంది.

# డాలర్‌కు దూరంగా బ్రిక్స్ అడుగులు?

- స్థానిక కరెన్సీల వినియోగంపై దృష్టి
- ఢిల్లీలో 12, 13 తేదీల్లో శిఖరాగ్ర సదస్సు



**న్యూఢిల్లీ :** అమెరికన్ డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించేందుకు బ్రిక్స్ దేశాలు ఏకాభిప్రాయానికి వస్తాయా? డాలర్‌కు ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థను రూపొందించే దిశగా కూటమి అడుగులు వేస్తుందా? ఈ ప్రశ్నలు ఢిల్లీలో ఈ వారాంతంలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. 2025 బ్రిక్స్ ప్రకటనలో అమెరికన్ డాలర్‌ను నేరుగా ప్రస్తావించకుండా, స్థానిక కరెన్సీల లో ఆమోదయోగ్యమైన ఆర్థిక సహాయ యంత్రాంగాలను అన్వేషించాలని పిలుపునిచ్చింది. సరిహద్దు వాణిజ్యం, ఆర్థిక లావాదేవీల్లో డాలర్‌పై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించాలన్న కూటమి విస్తృత ప్రయత్నాలకు ఇది సంకేతంగా భావిస్తున్నారు. అయితే ఉమ్మడి బ్రిక్స్ కరెన్సీని ఏర్పాటు చేయడం లేదా డాలర్‌ను పూర్తిగా భర్తీ చేయడం తమ లక్ష్యం కాదని సభ్యదేశాలు పలుమార్లు స్పష్టం చేశాయి. భారత్ కూడా ప్రత్యేక బ్రిక్స్ కరెన్సీకి అనుకూలంగా లేదు. డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించేందుకు స్థానిక కరెన్సీల వినియోగాన్ని పెంచడాన్ని సమర్థిస్తున్నప్పటికీ, డాలర్ స్థానాన్ని భర్తీ చేయడం తమ విధానం కాదని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ గతంలో స్పష్టం చేశారు. ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా డాలర్ పాత్ర అంతర్జాతీయ ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కూడా ఆగస్టులో ఇదే వైఖరిని వ్యక్తం చేశారు. అయితే సరిహద్దు వాణిజ్యం, పర్యాటక చెల్లింపులను సులభతరం చేసేందుకు బ్రిక్స్ దేశాల అధికారిక డిజిటల్ కరెన్సీలను అనుసంధానించే ప్రతిపాదనను ఆర్‌బీఐ ముందుకు తెచ్చింది. బ్రిక్స్ దేశాలు తమ వేగవంతమైన చెల్లింపుల వ్యవస్థలు, సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీలను అనుసంధానించే అంశాన్ని పరిశీలిస్తున్నాయని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. మరోవైపు చైనా వాణిజ్యం, పెట్టుబడుల్లో యువాన్ వినియోగాన్ని ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేందుకు పదేళ్ల వ్యూహాన్ని రూపొందిస్తోంది. మారకపు రేటు స్థిరత్వాన్ని కాపాడుతూ యువాన్ అంతర్జాతీయ వినియోగాన్ని పెంచాలని పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా భావిస్తోంది. రష్యా మాత్రం పాశ్చాత్య ఆంక్షలు, డాలర్ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు ఉన్న పరిమితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ చెల్లింపు మార్గాలపై దృష్టి పెడుతోంది. అయితే తాము అధికారికంగా డీ–డాలరైజేషన్‌ను చేపట్టడం లేదని క్రెమ్లిన్ స్పష్టం చేసింది. ఏ ఆమోదయోగ్యమైన చెల్లింపు విధానానికైనా రష్యా సిద్ధంగా ఉందని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ ఈ నెల 8న పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు బహుళ అంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు. భారత్ మండపంలో జరిగే సదస్సుకు వివిధ దేశాల ఉన్నతస్థాయి నాయకులు, ప్రతినిధులు హాజరుకానున్నారు. భద్రత కోసం 7,000 మంది సిబ్బందిని మోహరించగా, నగరంలో ట్రాఫిక్ నిర్వహణకు మరో 4,800 మంది ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహించనున్నారు. మరోవైపు కొద్దిరోజులుగా కొనసాగుతున్న దౌత్యపరమైన ఉత్కంఠకు తెరదించుతూ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ న్యూఢిల్లీలో జరిగే 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు హాజరవుతారని చైనా ప్రభుత్వం గురువారం ధ్రువీకరించింది.



## భండారాలో ఘోర రోడ్డు ప్రమాదం

### 9 మంది మృతి

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని భండారా జిల్లాలో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నాగ్‌పూర్–రాయ్‌పూర్ జాతీయ రహదారిపై పింపల్‌గావ్ సమీపంలో వేగంగా వెళ్తున్న బొలెరో వాహనం పెట్రోల్ పంపు వద్ద నిలిపి ఉన్న ట్రక్కును వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు, ఆరుగురు మహిళలు సహా 9 మంది మృతి చెందారు. పలువురు గాయపడగా, వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద దృశ్యాలు సీసీటీవీలో రికార్డు కాగా, అతివేగమే ప్రమాదానికి ప్రాథమిక కారణంగా పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## తల్లి చివరి కోరిక తీరకుండానే కన్నుమూత

- జైలులో ఉన్న కుమారుడిని చివరిసారైనా చూడాలని తల్లి ఆరాటం
- మరణానంతరం ఐదు గంటల పెరోల్‌పై చిన్మయ కృష్ణదాస్



**ఢాకా :** బంగ్లాదేశ్‌లో జైలులో ఉన్న హిందూ సాధువు, సనాతన జాగరణ్ మంచ్ ప్రతినిధి చిన్మయ కృష్ణదాస్ తల్లి సంధ్యా రాణి ధార్ కన్నుమూశారు. అయితే చివరి క్షణాల్లో తన కుమారుడిని చూడాలన్న ఆమె కోరిక తీరకుండానే ప్రాణాలు విడిచారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న సంధ్యా రాణి చత్తోగ్రామ్‌లోని శ్రీశ్రీ పుండరీక్ ధామ్ ఆశ్రమంలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. జైలులో ఉన్న చిన్మయ కృష్ణదాస్ ఆరోగ్యం క్షీణించినట్లు తెలుసుకుని ఆమె తీవ్ర మనోవేదనకు గురైనట్లు ఆయన సోదరుడు రంజన్ కుమార్ ధార్ తెలిపారు. తన కుమారుడిని చివరిసారైనా చూడాలని ఆమె కోరుకున్నప్పటికీ బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆయనకు పెరోల్ మంజూరు చేయలేదు. తల్లి మరణించిన అనంతరం గురువారం చిన్మయ కృష్ణదాస్‌కు ఐదు గంటలపాటు పెరోల్ మంజూరు చేసినట్లు సమాచారం. షేక్ హసీనా ప్రభుత్వం 2024లో కూలిపోయిన అనంతరం సనాతన జాగరణ్ మంచ్ ప్రతినిధిగా ఉన్న చిన్మయ కృష్ణదాస్‌ను అరెస్టు చేశారు. బంగ్లాదేశ్ జాతీయ జెండాను కించపరి చారన్న ఆరోపణలపై 2024 నవంబర్ 25న ఢాకా విమానాశ్రయంలో ఆయనను అదుపులోకి తీసు కున్నారు. ఆయన అరెస్టు అనంతరం మద్దతు దారులు, పోలీసుల మధ్య హింసాత్మక ఘర్షణలు చోటుచేసుకున్నాయి. తాజాగా తల్లి మరణంతో చిన్మయ కృష్ణదాస్ కుటుంబంలో విషాదం నెలకొంది.

## నీటిని ఆదా చేసే కచ్చితత్వ వ్యవసాయం

- వరి కిలోకు 1,500–2,000 లీటర్ల నీరు
- భవిష్యత్ ఆహార భద్రతకు ప్రిసిషన్ అగ్రికల్చర్ కీలకం




**చెన్నై :** దేశంలో తగ్గిపోతున్న నీటి వనరులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో వ్యవసాయంలో నీటి వినియోగాన్ని తగ్గించేందుకు 'ప్రిసిషన్ అగ్రికల్చర్' కీలకంగా మారనుంది. భారతీయ వరి సాగుపై జరిగిన అధ్యయనం ప్రకారం కిలో బియ్యం పండించడానికి సగటున 1,500 నుంచి 2,000 లీటర్ల నీరు అవసరమవుతోంది. వర్షాధార సాగు తక్కువగా, భూగర్భ జలాలను విపరీతంగా వినియోగించే పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో కిలో బియ్యానికి 2,270 నుంచి 2,672 లీటర్ల వరకు నీరు అవసరమవుతోంది. దేశంలో వినియోగించే మొత్తం మంచినీటిలో దాదాపు 90 శాతం వ్యవసాయానికే ఖర్చవుతోంది. చెరుకు వంటి పంటలకు కూడా భూమిలో తేమ నిరంతరం ఉండాల్సి రావడంతో నీటి వినియోగం అధికంగా ఉంటుంది. ఈ సమస్యకు పరిష్కారంగా ఐఐటీ మద్రాస్ 'ప్రిసిషన్ అగ్రికల్చర్'పై దృష్టి సారిస్తోంది. తక్కువ నీటితో వరి, చెరుకు వంటి పంటలను పండించడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశమని ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ. కామకోటి తెలిపారు. ఐఐటీ మద్రాస్ సొంత టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ 'మిషన్ ప్రవర్తక్'లో సెన్సార్లు, నెట్‌వర్క్‌లు, కంట్రోల్ సిస్టమ్‌లపై పరిశోధనలు జరుగుతున్నాయి. ప్రిసిషన్ అగ్రికల్చర్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఎలా వినియోగించాలన్న అంశంపై కెనడా భాగస్వాముల తో కలిసి ప్రవర్తక్ ఇప్పటికే వర్క్‌షాప్‌లు నిర్వహించింది. ఈ విధానంలో పంటకు ఎంత నీరు అవసరమో అంతే అందించడం, ఒక్క చుక్క నీటిని కూడా వృథా కాకుండా చూడటం ప్రధాన లక్ష్యం. నేలలో ఏర్పాటు చేసే సెన్సార్లు తేమను ఎప్పటికప్పుడు గుర్తించి, పంటకు నీరు అవసరమైన సమయాన్ని సూచిస్తాయి. దీంతో రైతులు అంచనాలతో కాకుండా నేల పరిస్థితికి అనుగుణంగా నీటిని అందించవచ్చు. పొలమంతా నీటితో నింపకుండా మొక్కల వేర్లకు అవసరమైన మేరకు చుక్కల రూపంలో నీటిని అందించవచ్చు. మరోవైపు శాటిలైట్లు, డ్రోన్ల ద్వారా పంటను పర్యవేక్షిస్తూ పొలంలో ఏ ప్రాంతంలో పైరు సరిగా పెరగడం లేదో ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. వరి సాగులో 'ఆల్టర్నేట్ వెట్టింగ్ అండ్ డ్రైయింగ్' విధానంతో పొలాన్ని ఎప్పుడూ నీటిలో ఉంచకుండా, నీరు పెట్టిన తర్వాత కొంతకాలం ఆరనివ్వడం ద్వారా దిగుబడిపై ప్రభావం లేకుండానే నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని శాస్త్రవేత్తలు ఇప్పటికే నిరూపించారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పంటలకు నీటి అవసరం మరింత పెరుగుతున్న నేపథ్యంలో ప్రిసిషన్ అగ్రికల్చర్ భారత్‌కు అత్యంత అవసరమని నిపుణులు భావిస్తున్నారు. భవిష్యత్‌లో తగ్గిపోతున్న నీటి వనరుల మధ్య దేశ ఆహార అవసరాలను తీర్చుకోవడంలో ఈ సాంకేతిక వ్యవసాయ విధానం కీలక పాత్ర పోషించనుంది.

# ట్రంప్ 'ఉచిత హామీ'

- పెద్దలందరికీ రూ.4.76 లక్షలు
- రిపబ్లికన్లను గెలిపిస్తే 5,000 డాలర్ల డివిడెండ్
- మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్ యుద్ధానికి ముగింపు: ట్రంప్



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత రాజకీయాలను అనుసరిస్తున్నారా? అన్నట్లుగా మధ్యంతర ఎన్నికల వేళ ఓటర్లకు భారీ హామీ ఇచ్చారు. నవంబర్‌లో జరిగే ప్రతినిధుల సభ, సెనేట్ ఉప ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థులను గెలిపిస్తే అమెరికాలోని వయోజన పౌరులందరికీ 5,000 డాలర్లు (సుమారు రూ.4.76 లక్షలు) 'డివిడెండ్'గా చెల్లిస్తామని ట్రంప్ ప్రకటించారు. డాలస్‌లో జరిగిన ఓ సదస్సులో మద్దతుదారులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, ఈ ఎన్నికల్లో తానే పోటీ చేస్తున్నట్లు భావించి రిపబ్లికన్ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. అమెరికా భారీగా ఆదాయం ఆర్జిస్తోందని, అందుకే ప్రజలకు ఈ మొత్తాన్ని చెల్లిస్తున్నామని ట్రంప్ పేర్కొన్నారు. విజయవంతమైన కంపెనీలు తమ వాటాదారులకు నగదు పంపిణీ చేసే విధానంతో ఈ చెల్లింపులను పోల్చారు. అయితే ఈ హామీని ఎలా అమలు చేస్తారు? నిధులు ఎక్కడి నుంచి సమకూరుస్తారు? అనే అంశాలపై ఆయన ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. రిపబ్లికన్లు గెలిస్తే ప్రజలు తమతో కలిసి గెలిచినట్లేనని మాత్రమే చెప్పారు. ఈ డివిడెండ్‌కు సంబంధించి ట్రంప్ విధించిన ఏకైక షరతు.. అందుకున్న మొత్తాన్ని అమెరికాలోనే ఖర్చు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అమెరికా–ఇరాన్ యుద్ధం ముగింపుపైనా ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్‌తో యుద్ధం ముగిసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఇరాన్ ఎక్కువకాలం యుద్ధాన్ని కొనసాగించే పరిస్థితిలో లేదని, తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లిపోయిందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే 'వాల్ స్ట్రీట్ జర్నల్' కథనం ప్రకారం.. ట్రంప్ హయాంలో మరో రెండేళ్లపాటు యుద్ధం కొనసాగ వచ్చని ఆయనకు అత్యంత సన్నిహితులైన ఇద్దరు హెచ్చరిస్తున్నట్లు సమాచారం. దీంతో యుద్ధం ముగింపుపై ట్రంప్ ప్రకటన, ఆయన సన్నిహితుల అంచనాల మధ్య భిన్నాభిప్రాయాలు కనిపిస్తున్నాయి.

## హౌతీలపై దాడులకు సౌదీ ఒత్తిడి

### ట్రంప్‌కు రెండుసార్లు ఫోన్ చేసిన ఎంబీఎస్

### ప్రత్యక్ష దాడులకు అమెరికా విముఖత

**రియాద్ :** ఇరాన్–అమెరికా మధ్య యుద్ధం ముదురుతున్న నేపథ్యంలో యెమెన్‌లోని హౌతీలు కూడా రంగంలోకి దిగడంతో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. ప్రధానంగా ఎర్ర సముద్రం, సౌదీ అరేబియాపై హౌతీలు దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో వారిపై సైనిక చర్యలు చేపట్టాలని సౌదీ రాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబీఎస్) అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కోరినట్లు సమాచారం. ఈ విషయమై ఎంబీఎస్ ట్రంప్‌కు రెండుసార్లు ఫోన్ చేసినట్లు తెలుస్తోంది. యెమెన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తున్న హౌతీలకు ఇరాన్ మద్దతు ఇస్తోంది. ఆర్థిక వనరులు, ఆయుధాలు తదితర సహకారాన్ని అందిస్తున్న ఇరాన్‌పై అమెరికా దాడులు చేస్తున్న నేపథ్యంలో హౌతీలు కూడా ఇరాన్‌కు మద్దతుగా రంగంలోకి దిగారు. సౌదీపై దాడులతోపాటు ఎర్ర సముద్రంలో సౌదీ చమురు నౌకలు ప్రయాణించే మార్గాన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో హౌతీలపై చర్యలు తీసుకోవాలని సౌదీ అమెరికాను కోరింది. అయితే యెమెన్‌లో కొనసాగుతున్న అంతర్యుద్ధం కారణంగా హౌతీలపై నేరుగా దాడులు చేయడానికి అమెరికా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

## హెచ్1బీ వీసాదారులకు మరో షాక్

- ఉద్యోగం పోతే 60 రోజుల గ్రేస్ పీరియడ్ ఎత్తివేతకు అమెరికా ప్రతిపాదన
- భారతీయులపై తీవ్ర ప్రభావం




**న్యూఢిల్లీ :** ఇప్పటికే వీసాలపై పలు ఆంక్షలు విధిస్తున్న అమెరికా ప్రభుత్వం హెచ్1బీ సహా పలు వీసాదారులకు మరో షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఉద్యోగం కోల్పోయిన విదేశీయులు మరో ఉద్యోగం వెతుక్కునేందుకు ప్రస్తుతం ఉన్న 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను తొలగించే ప్రతిపాదనను అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) తీసుకొచ్చింది. 'ఎలిమినేటింగ్ ది డిస్క్రెషనరీ 60 డే గ్రేస్ పీరియడ్' పేరుతో ఈ ప్రతిపాదనను ఫెడరల్ రిజిస్టర్‌లో నమోదు చేశారు. ప్రస్తుతం హెచ్1బీ వీసాదారులు ఉద్యోగం కోల్పోయినప్పటికీ 60 రోజులపాటు అమెరికాలో ఉండి కొత్త ఉద్యోగాన్ని వెతుక్కునే అవకాశం ఉంది. కొత్త ప్రతిపాదన అమల్లోకి వస్తే ఈ వెసులుబాటు ఉండదు. ఉద్యోగం కోల్పోయిన వెంటనే తదుపరి వీసా నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రతిపాదనపై ప్రజలు 60 రోజుల్లోగా తమ అభిప్రాయాలను తెలియజేయాల్సి ఉంటుంది. అనంతరం నిబంధన అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఈ మార్పు ఈ1, ఈ2, ఈ3, హెచ్1బీ, హెచ్1బీ1, ఎల్1, ఓ1, టీఎన్ తదితర వీసాలపై అమెరికాలో ఉంటున్న ఉద్యోగులపై ప్రభావం చూపనుంది. ముఖ్యంగా హెచ్1బీ వీసాలపై పెద్ద సంఖ్యలో భారతీయులు అమెరికాలో పనిచేస్తున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదన వారిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉద్యోగం కోల్పోయిన వారు 60 రోజుల గ్రేస్ పీరియడ్‌లో కొత్త ఉద్యోగం వెతుక్కుని తమ వీసా స్థితిని కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారు. కొత్త నిబంధన అమల్లోకి వస్తే అనూహ్యంగా ఉద్యోగం కోల్పోయిన భారతీయులు తక్కువ సమయంలోనే ప్రత్యామ్నాయ ఉద్యోగం లేదా వీసా మార్గాన్ని చూసుకోవాల్సి ఉంటుంది. లేదంటే అమెరికా విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. దీంతో అమెరికాలో పనిచేస్తున్న భారతీయ టెక్ ఉద్యోగుల్లో ఈ ప్రతిపాదనపై ఆందోళన వ్యక్తమవుతోంది.

## ఏఐతో ఆయుధాల తయారీకి యత్నాలు

- క్లాడ్ టెక్నాలజీని క్షిపణి సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి వినియోగించినట్లు ఆంథ్రోపిక్ వెల్లడి
- జీవాయుధాలపైనా హెచ్చరిక



**న్యూఢిల్లీ :** కృత్రిమ మేధ (ఏఐ) దుర్వినియోగంపై ఆంథ్రోపిక్ సంస్థ సంచలన విషయాలను వెల్లడించింది. యెమెన్‌లోని హౌతీలకు చెందిన ఓ బృందం తమ 'క్లాడ్' ఏఐ టెక్నాలజీని ఆయుధాల అభివృద్ధికి వినియోగించినట్లు ఆంథ్రోపిక్ పేర్కొంది. క్షిపణులు, రాకెట్లకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో క్లాడ్ ఏఐను ఉపయోగించినట్లు గుర్తించినట్లు తెలిపింది. చైనా, రష్యా, యెమెన్‌లలో క్లాడ్ మోడల్‌ను దుర్వినియోగం చేస్తున్న పలు కార్యకలాపాలను గుర్తించినట్లు సంస్థ వెల్లడించింది. యెమెన్‌లోని ఓ బృందం క్షిపణి కార్యక్రమంపై పనిచేస్తూ, మానవ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు బదులుగా క్లాడ్ రూపొందించిన కోడ్‌ను ఉపయోగించినట్లు ఆంథ్రోపిక్ తెలిపింది. విమానాలు, ఇతర ఎగిరే వాహనాలకు సంబంధించిన మార్గనిర్దేశం, నావిగేషన్, నియంత్రణ వ్యవస్థల సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలోనూ ఏఐను వినియోగించినట్లు పేర్కొంది. అయితే క్లాడ్ సాంకేతికత ఆధారంగా రూపొందించిన ఓ రాకెట్ ప్రయోగం విఫలమైనట్లు ఆంథ్రోపిక్ వెల్లడించింది. ఆయుధాల అభివృద్ధికి ఏఐ మోడళ్లను వినియోగించే ధోరణి ఆందోళనకరమని పేర్కొన్న సంస్థ, భవిష్యత్తులో ఏఐను ఉపయోగించి జీవాయుధాల తయారీకి కూడా ప్రయత్నాలు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఏఐ దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు కఠినమైన నియంత్రణలు, పర్యవేక్షణ అవసరమని ఆంథ్రోపిక్ సూచించింది.

## హిందూ బాలికలను కిడ్నాప్ చేసి బలవంతపు మతమార్పిడి

- 13, 14 ఏళ్ల అక్కాచెల్లెళ్లకు బలవంతంగా పెళ్లి
- తల్లిదండ్రులతో పంపించేందుకు కోర్టు నిరాకరణ



**సింధ్ :** పాకిస్తాన్‌లో మైనారిటీలపై వేధింపులు, దాడులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలకు తాజాగా మరో ఘటన తెరపైకి వచ్చింది. సింధ్ ప్రావిన్స్‌లోని తాండో అల్లాహ్యార్ జిల్లాలో 13, 14 ఏళ్ల వయసున్న హిందూ అక్కాచెల్లెళ్లను కిడ్నాప్ చేసి బలవంతంగా ఇస్లాంలోకి మార్చడంతోపాటు పెళ్లి చేసుకున్నట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఈ నెల 9న జరిగిన ఈ ఘటనలో కచ్చి కోల్హి అనే హిందూ కుటుంబానికి చెందిన బాలికలను అంజాద్ సోలాంగి, మన్సూర్ సోలాంగి అనే ఇద్దరు వ్యక్తులు కిడ్నాప్ చేసినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. అనంతరం బాలికలను బలవంతంగా మతం మార్చి పెళ్లి చేసుకున్నారని పేర్కొన్నారు. దీనిపై బాధిత కుటుంబం స్థానిక జిల్లా కోర్టును ఆశ్రయించగా, బాలికలు కోర్టుకు హాజరై తమను కిడ్నాప్ చేసి, మతమార్పిడి అనంతరం బలవంతంగా పెళ్లి చేసుకున్నారని న్యాయమూర్తికి వివరించినట్లు సమాచారం. తమను తల్లిదండ్రుల వద్దకు పంపించా లని బాలికలు కోర్టును వేడుకున్నప్పటికీ.. వారిని కుటుంబ సభ్యులతో పంపించేందుకు కోర్టు నిరాకరించినట్లు తెలుస్తోంది. బాలికలను సురక్షిత ప్రాంతానికి తరలించాలని మాత్రమే కోర్టు ఆదేశించినట్లు సమాచారం. న్యాయమూర్తి ఎదుట బాలికలు కన్నీళ్లతో తమ తల్లిదండ్రుల వద్దకు పంపించాలని కోరినా సానుకూల స్పందన రాలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు పాకిస్తాన్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, మైనర్ బాలికల కిడ్నాప్, బలవంతపు మతమార్పిడులపై అమెరికాకు చెందిన సింధీ హక్కుల సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. సింధ్ ప్రాంతంలో గత పది రోజుల్లోనే ఆరుగురు మైనర్ బాలికలను కిడ్నాప్ చేసి మతమార్పిడులకు పాల్పడిన ఘటనలు నమోదయ్యా యని ఆ సంస్థ వెల్లడించింది. ఇటువంటి ఘటనలు పాకిస్తాన్‌లో సర్వసాధారణమవుతున్నాయని ఆందోళ న వ్యక్తం చేసింది.

## వ్యర్థ జలాలతో విద్యుత్ ఉత్పత్తి

- సింక్‌లో వృథాగా పోయే నీటితో కరెంట్
- మలేషియా విద్యార్థుల వినూత్న ఆవిష్కరణ

**కౌలాలంపూర్ :** ఇంట్లోని సింక్ నుంచి వృథాగా వెళ్లిపోయే వ్యర్థ జలాలతో విద్యుత్‌ను ఉత్పత్తి చేసే వినూత్న పరికరాన్ని మలేషియా విద్యార్థులు అభివృద్ధి చేశారు. మలయా విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థులు రూపొందించిన 'వాట్స్అప్' పరికరం సింక్‌లోని నీరు నేరుగా డ్రెయిన్‌లోకి వెళ్లకుండా ముందుగా ఫిల్టర్ చేసి కొంతసేపు నిల్వ చేస్తుంది. అనంతరం నాజిల్ ద్వారా నీటిని అధిక వేగంతో విడుదల చేస్తుంది. ఈ నీటి జెట్ ఒక చిన్న పెల్టన్ టర్బైన్‌ను తిప్పడంతో అది జనరేటర్‌ను నడిపిస్తుంది. ఈ విధంగా సాధారణం గా వృథాగా వెళ్లిపోయే నీటినే వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని విద్యార్థులు నిరూపించారు.

# సచిన్ రికార్డుపై జో రూట్ కన్ను

- టెస్టుల్లో 15,921 పరుగులతో అగ్రస్థానంలో సచిన్
- 14,208 పరుగులతో రెండో స్థానంలో రూట్..
- రెండేళ్లు ఆడితే రికార్డు బద్దలు కొట్టే అవకాశం
- యార్క్‌షైర్ అత్యుత్తమ బ్యాటర్ ఇక రూటే: వివ్ రిచర్డ్స్

**లండన్:** ప్రపంచ క్రికెట్‌లో దిగ్గజ బ్యాటర్ సచిన్ తెందుల్కర్ పేరిట ఎన్నో రికార్డులు ఉన్నాయి. టెస్టు క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా ఆయన రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. అయితే ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్, కెప్టెన్ జో రూట్ ఆ రికార్డుకు చేరువగా వచ్చాడు.

సచిన్ 15,921 పరుగులతో అగ్రస్థానంలో ఉండగా.. రూట్ ఇప్పటివరకు 14,208 పరుగులు సాధించాడు.ప్రస్తుతం రూట్ మంచి ఫామ్‌లో కొనసాగుతున్న నేపథ్యంలో.. మరో రెండేళ్లపాటు ఇదే స్థాయిలో ఆడితే సచిన్ రికార్డును అధిగమించే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో క్రికెట్ దిగ్గజం వివ్ రిచర్డ్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జో రూట్ ప్రస్తుతం ఇంగ్లాండ్ కెప్టెన్‌గా ఉన్నందున తుది జట్టులో అతడి స్థానం దాదాపు ఖాయమని రిచర్డ్స్ అన్నారు. సచిన్ రికార్డును అధిగమించేందుకు రూట్ అనుకూల పరిస్థితుల్లో ఉన్నాడని పేర్కొన్నారు. సచిన్ రికార్డును బద్దలు కొట్టడం రూట్ కెరీర్‌లోనే ఓ గొప్ప మైలురాయిగా నిలుస్తుందని రిచర్డ్స్ అభిప్రాయపడ్డారు. అదే సమయంలో ఇంగ్లాండ్ క్రికెట్ దిగ్గజం జెఫ్రీ బాయ్‌కాట్‌కు కూడా ఓ సందేశం వెళ్లినట్లవుతుందని సరదాగా వ్యాఖ్యానించారు. యార్క్‌షైర్ నుంచి వచ్చిన అత్యుత్తమ బ్యాటర్ ఇకపై జో రూట్ అని బాయ్‌కాట్‌కు చెప్పినట్లవుతుందని అన్నారు.

### మా అబ్బాయికి మంచి రికార్డు ఉంది

జో రూట్ తండ్రి మ్యాట్ రూట్ కూడా తన కుమారుడి రికార్డుపై స్పందించారు. గతంలో కెప్టెన్‌గా ఉన్న సమయంలో రూట్ ఒక్క ఏడాదిలోనే 1,700 పరుగులు సాధించాడని గుర్తుచేశారు. కెప్టెన్సీ బాధ్యతలు తన బ్యాటింగ్‌పై ప్రభావం చూపవని రూట్ అప్పుడే నిరూపించాడని అన్నారు. రూట్ ఫిట్‌గా ఉండి, ఏకాగ్రతతో కొనసాగుతూ.. ఆడాలనే తపనను నిలబెట్టుకుంటే సచిన్ టెస్టు పరుగుల రికార్డును అధిగమించడం పెద్ద కష్టమేమీ కాదని మ్యాట్ రూట్ అభిప్రాయపడ్డారు.

# జపాన్‌లో క్రికెట్‌కు కొత్త ఊపు

- భారత్‌తో తొలి టీ20కి రంగం సిద్ధం!
- 22న టీమ్ఇండియాతో జపాన్ తొలి టీ20
- ఇప్పటికే పూర్తిగా అమ్ముడైన మ్యాచ్ టికెట్లు
- భారత్-జపాన్ దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవాలకు గుర్తు
- ఇండియాతో మా క్రికెట్ చరిత్రలో తొలి అడుగు: జపాన్ కెప్టెన్




**టోక్యో:** సెప్టెంబర్ 22.. జపాన్ క్రికెట్ అభిమానులకు ప్రత్యేకంగా గుర్తుండిపోయే రోజు కానుంది. తొలిసారి టీమ్ఇండియాతో జపాన్ టీ20 మ్యాచ్‌లో తలపడనుంది.బేస్‌బాల్‌కు అత్యంత ఆదరణ ఉన్న జపాన్‌లో క్రికెట్‌ను మరింత విస్తరించడంతో పాటు.. భారత్–జపాన్ ద్వైపాక్షిక సంబంధాల 75వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఈ మ్యాచ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లన్నీ ఇప్పటికే విక్రయమైనట్లు జపాన్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. 2026 ఆసియా క్రీడలు కూడా జపాన్‌లోనే జరగనున్న నేపథ్యంలో భారత్ వంటి అగ్రశ్రేణి జట్టుతో జరిగే ఈ మ్యాచ్.. దేశంలో క్రికెట్‌కు మరింత ఆదరణ తీసుకురావచ్చని భావిస్తున్నారు.

### మ్యాచ్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం

టీమ్ఇండియాతో మ్యాచ్ కోసం తాము ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నామని జపాన్ కెప్టెన్ కెండెల్ కడోవాకి ఫ్లెమింగ్ తెలిపారు. దేశంలో క్రికెట్ అభివృద్ధికి ఈ మ్యాచ్ ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అఫ్గానిస్థాన్, నేపాల్ వంటి జట్లతో మ్యాచ్‌లు నిర్వహించడమే రెండేళ్ల క్రితం వరకు కష్టంగా భావించేవాళ్లమని.. ఇప్పుడు భారత్ వంటి అగ్రశ్రేణి జట్టుకు ఆతిథ్యం ఇచ్చే స్థాయికి చేరుకున్నామని కెండెల్ పేర్కొన్నారు.

### భారత్‌తో ఆడటం.. మా సామర్థ్యానికి పరీక్ష

కేవలం భారత్‌తో ఆడుతున్న సందర్భాన్ని ఆస్వాదించడం మాత్రమే తమ లక్ష్యం కాదని జపాన్ కెప్టెన్ స్పష్టం చేశారు. ఓ జట్టుగా తాము ఏం చేయగలమో నిరూపించుకోవాలని భావిస్తున్నామని తెలిపారు. అన్ని విభాగాల్లోనూ భారత్ అత్యుత్తమ జట్టని.. ప్రపంచ స్థాయి ఆటగాళ్లతో ప్రత్యక్షంగా ఆడటం తమకు గొప్ప అనుభూతిని ఇస్తుందని కెండెల్ అన్నారు. ఐసీసీ పూర్తి సభ్య దేశాలతో పోటీపడే దిశగా ఈ మ్యాచ్ తమ క్రికెట్ ప్రయాణంలో తొలి అడుగు అవుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత్‌తో జరిగే ఈ చారిత్రక మ్యాచ్ ద్వారా జపాన్‌లో క్రికెట్‌కు మరింత ప్రాచుర్యం లభిస్తుందని.. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని అవకాశాలు అందిపుచ్చుకునేందుకు ఇది దోహదపడుతుందని జపాన్ క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.

# సెహ్వాగ్‌నే ఇబ్బంది పెట్టిన పిచ్‌పై ఆయూబ్‌ను ఎలా దింపారు?

- రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ డకౌట్..

పాక్ మేనేజ్‌మెంట్‌పై నాజర్ హుస్సేన్ ఫైర్




**లండన్:** పాకిస్థాన్ క్రికెట్ జట్టు నిర్ణయాలు మరోసారి విమర్శలకు దారితీశాయి. పర్యటన మధ్యలోనే ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపడం, సుదీర్ఘ ఫార్మాట్‌లో చాలా కాలంగా ఆడని సైమ్ ఆయూబ్‌ను ఇంగ్లాండ్‌తో టెస్టు మ్యాచ్‌లో తుది జట్టులోకి తీసుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూడో టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సైమ్ ఆయూబ్ డకౌట్ కావడంతో ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ నాజర్ హుస్సేన్ పాక్ మేనేజ్‌మెంట్ తీరును తప్పుబట్టాడు. సైమ్ ఆయూబ్ చివరిసారిగా 2025 అక్టోబర్‌లో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడాడని నాజర్ హుస్సేన్ పేర్కొన్నాడు. ఆ తర్వాత అతడు సుదీర్ఘ ఫార్మాట్‌కు దూరంగా ఉన్నాడని, సీపీఎల్‌లో టీ20 క్రికెట్ ఆడి నేరుగా ఇంగ్లాండ్‌లో టెస్టు బరిలోకి దించడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డాడు.

విదేశీ పిచ్‌లపై అనుభవం లేని ఆటగాడిని ఇంగ్లాండ్ వంటి పరిస్థితుల్లో టాప్ ఆర్డర్‌లో ఆడించడం కఠినమైన నిర్ణయమని నాజర్ అన్నాడు. ముఖ్యంగా ఇంగ్లిష్ గడ్డపై బలమైన బౌలింగ్ దాడిని ఎదుర్కోవాలంటే టెస్టు క్రికెట్‌లో అనుభవం అవసరమని పేర్కొన్నాడు. ఇలాంటి నిర్ణయాలు టెస్టు ఫార్మాట్‌ను అగౌరవపరిచినట్లేనని విమర్శించాడు. ఇంగ్లాండ్‌లో టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయడం అత్యంత కష్టం. కానీ, సైమ్ ఆయూబ్‌ను తీసుకొచ్చి నేరుగా బరిలోకి దించారు. చివరకు అతడు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సున్నాకే పరిమితమయ్యాడు'' అని నాజర్ వ్యాఖ్యానించాడు.

### సెహ్వాగ్‌ను ఉదాహరణగా..

సైమ్ ఆయూబ్ పరిస్థితిని వివరిస్తూ నాజర్ హుస్సేన్ 2011లో భారత్ ఇంగ్లాండ్ పర్యటనను ఉదాహరణగా ప్రస్తావించాడు. ఆ సిరీస్ మధ్యలో భారత్ నుంచి వీరేంద్ర సెహ్వాగ్‌ను ఇంగ్లాండ్‌కు పిలిపించి మూడో టెస్టులో నేరుగా ఓపెనర్‌గా బరిలోకి దించారు. అయితే సెహ్వాగ్ కూడా ఆ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ డకౌట్ అయ్యాడు. ఇదే ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో సెహ్వాగ్ కూడా రెండు ఇన్నింగ్స్‌ల్లో పరుగులేమీ చేయలేదు. అతడిని కూడా సిరీస్ మధ్యలో భారత్ నుంచి పిలిపించారు. ఎంతో అనుభవం ఉన్న సెహ్వాగ్ సైతం ఈ పిచ్‌పై ఇబ్బంది పడ్డాడు. అలాంటప్పుడు సైమ్ ఆయూబ్ అతడి కంటే గొప్ప ఆటగాడా? అని నాజర్ హుస్సేన్ ప్రశ్నించాడు.

# పాకిస్థాన్‌కు షాక్.. ఫైనల్‌కు శ్రీలంక

- సెమీఫైనల్‌లో 4 వికెట్ల తేడాతో ఘన విజయం
- 18.4 ఓవర్లలో 131 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన లంక
- సెప్టెంబర్ 13న భారత్‌తో తుదిపోరు



**దుబాయ్:** మహిళల ఆసియా కప్‌లో శ్రీలంక ఫైనల్‌కు దూసుకెళ్లింది. పాకిస్థాన్‌తో జరిగిన సెమీఫైనల్‌లో 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత పాకిస్థాన్ నిర్దేశించిన 131 పరుగుల లక్ష్యాన్ని శ్రీలంక 18.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. శ్రీలంక బ్యాటర్లలో హర్షిత సమర విక్రమ 36 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడగా.. కవీశా దిల్హరి 33, ఇమేశా దులానీ 24 పరుగులు చేశారు. నీలాక్షిక 18, కౌశాని 10 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చారు. పాకిస్థాన్ బౌలర్లలో ఫాతిమా సనా 4 వికెట్లు పడగొట్టగా.. సాదియా ఇక్బాల్, ఉమ్ ఇ హని చెరో వికెట్ తీశారు.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. ఫాతిమా సనా 47 పరుగులతో అజేయంగా నిలిచారు. షవాల్ జుల్ఫికర్ 24, గుల్ ఫెరోజా 21 పరుగులు చేశారు.శ్రీలంక బౌలర్లలో చమరి ఆటపట్టు, చముడి ప్రబోధ చెరో రెండు వికెట్లు పడగొట్టగా.. సుగంధిక కుమారి ఒక వికెట్ తీసింది. సెమీఫైనల్‌లో పాకిస్థాన్‌ను ఓడించిన శ్రీలంక.. సెప్టెంబర్ 13న జరిగే ఫైనల్‌లో భారత్‌తో తలపడనుంది. దీంతో మహిళల ఆసియా కప్ టైటిల్ కోసం భారత్, శ్రీలంక మధ్య ఆసక్తికర పోరు జరగనుంది.

# యూఎస్ ఓపెన్ ఫైనల్లో..రిబకినా వర్సెస్ సబలెంకా

- గాఫ్, పెగులాలను ఓడించి ఫైనల్లోకి దూసుకొచ్చిన స్టార్లు
- 2013 తర్వాత తొలిసారి ఇద్దరు టాప్ సీడ్లు ఫైనల్లో ఢీ



**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. టాప్ సీడ్ అరినా సబలెంకా, రెండో సీడ్ ఎలినా రిబకినా తుదిపోరులో తలపడనున్నారు. శనివారం జరిగే ఈ మ్యాచ్‌పై టెన్నిస్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇద్దరూ సెమీఫైనల్లో అద్భుత ప్రదర్శనతో ప్రత్యర్థులను ఓడించి ఫైనల్‌కు చేరుకున్నారు.

### గాఫ్‌పై రిబకినా విజయం

సెమీఫైనల్లో కజకిస్థాన్ స్టార్ ఎలినా రిబకినా 3–6, 6–4, 6–4తో అమెరికా క్రీడాకారిణి కోకో గాఫ్‌ను ఓడించింది. తొలి సెట్‌ను కోల్పోయినప్పటికీ ఆ తర్వాత పుంజుకున్న రిబకినా వరుసగా రెండు సెట్లు గెలిచి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది.

హ్యాట్రిక్‌పై సబలెంకా కన్ను

మరో సెమీఫైనల్లో అరినా సబలెంకా 7–5, 6–2తో అమెరికా ప్లేయర్ జెస్సికా పెగులాను చిత్తు చేసింది. వరుసగా మూడోసారి యూఎస్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకోవాలనే లక్ష్యంతో సబలెంకా ఫైనల్ బరిలోకి దిగనుంది. ప్రస్తుతం 99 వారాలుగా ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్న సబలెంకాకు ఈ విజయం మరింత కీలకం కానుంది.

### అగ్రస్థానం కోసం రిబకినా పోరు

ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న రిబకినా.. ఫైనల్లో విజయం సాధిస్తే నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకునే అవకాశం ఉంది. దీంతో టైటిల్‌తో పాటు అగ్రస్థానం కోసం కూడా ఇద్దరి మధ్య పోరు ఆసక్తికరంగా మారింది. 2013 తర్వాత యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో ఇద్దరు టాప్ సీడ్లు తలపడటం ఇదే తొలిసారి. 2013లో సెరీనా విలియమ్స్, విక్టోరియా అజరెంకా తుదిపోరులో తలపడ్డారు. ఇప్పుడు రిబకినా, సబలెంకా మధ్య జరగనున్న ఫైనల్ కూడా అదే తరహాలో ప్రత్యేకతను సంతరించుకుంది.





# కార్పొరేట్ బాండ్లలో డిజిటల్ టోకెన్లు: సెబీ

- అటామిక్ సెటిల్‌మెంట్‌తో బాండు, నగదు తక్షణ బదిలీ
- ఆర్‌బీఐ హోల్‌సేల్ సీబీడీసీతో డి-మ్యాట్ 2.0 అనుసంధానం
- యూపీఐలో 'ట్యాప్ అండ్ పే', ఏఐ ఆధారిత 'మైయూపీఐ' ఆవిష్కరణ

**ముంబయి:** కార్పొరేట్ బాండ్ల జారీ, హోల్డింగ్, విక్రయాలను మరింత వేగంగా, సమర్థంగా నిర్వహించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ 'డి–మ్యాట్ 2.0' పేరుతో పైలట్ ప్రాజెక్టును ప్రారంభించింది. డిస్ట్రిబ్యూటెడ్ లెడ్జర్ టెక్నాలజీ ఆధారంగా పనిచేసే ఈ కొత్త మౌలిక సదుపాయం ద్వారా కార్పొరేట్ బాండ్లను డిజిటల్ టోకెన్లుగా రూపొందించనున్నారు. ముఖ్యంగా అటామిక్ సెటిల్‌మెంట్ ద్వారా బాండు, నగదు ఒకేసారి తక్షణం బదిలీ అయ్యేలా వ్యవస్థను రూపొందించారు. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా, సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే సంయుక్తంగా డి–మ్యాట్ 2.0ను ప్రకటించారు. ఆర్‌బీఐ యూనిఫైడ్ మార్కెట్ ఇంటర్‌ఫేస్ (యూఎంఐ) ద్వారా ఆర్‌బీఐ హోల్‌సేల్ సీబీడీసీతో దీనిని అనుసంధానించారు.

### తక్షణ సెటిల్‌మెంట్

డి–మ్యాట్ 2.0లో డిస్ట్రిబ్యూటెడ్ లెడ్జర్‌పై కార్పొరేట్ బాండును డిజిటల్ టోకెన్‌గా సృష్టిస్తారు. లెడ్జర్ డిపాజిటరీల యాజమాన్యంలో ఉంటుంది. అటామిక్ సెటిల్‌మెంట్ కారణంగా బాండు, డబ్బు ఒకేసారి తక్షణమే బదిలీ అవుతాయని సెబీ తెలిపింది.

అంతేకాకుండా వడ్డీ చెల్లింపులు, రిడెంప్షన్, ఇతర అసెట్ సర్వీసింగ్ ప్రక్రియలను స్మార్ట్ కాంట్రాక్టుల ద్వారా ఆటోమేటిక్‌గా నిర్వహించవచ్చు. లెడ్జర్‌లో నమోదైన నిర్దేశాలు వాటంతట అవే అమలవుతాయి. బాండు హోల్డర్ల వివరాలు కూడా అధీకృత సంస్థలకు ఒకేసారి అందుబాటులో ఉంటాయి. గడువు తేదీన బాండు హోల్డర్ల డిజిటల్ వాలెట్లకు చెల్లింపులు చేసే అవకాశం ఉంటుంది. ఈ సదుపాయాలన్నింటి ద్వారా కార్పొరేట్ బాండ్ల జారీ, సెటిల్‌మెంట్, సర్వీసింగ్ ప్రక్రియలను వేగవంతం చేయడంతో పాటు లావాదేవీల సామర్థ్యాన్ని పెంచి, లోపాలను తగ్గించవచ్చని సెబీ పేర్కొంది.

### యూపీఐలో కొత్త సదుపాయాలు

ఇదే కార్యక్రమంలో వినియోగదారుల కోసం రెండు కొత్త యూపీఐ ఆవిష్కరణలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. ఇందులో ఒకటి పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) టెర్మినల్స్‌పై 'యూపీఐ ట్యాప్ అండ్ పే' సదుపాయం. ఎన్ఎఫ్‌సీ సదుపాయం ఉన్న స్మార్ట్‌ఫోన్‌ను అన్‌లాక్ చేసి.. ఎన్ఎఫ్‌సీ ఆధారిత పీఓఎస్ టెర్మినల్‌పై ట్యాప్ చేయడం ద్వారా చెల్లింపు పూర్తి చేయవచ్చు. ఈ విధానం వినియోగదారుడి మొబైల్ ఇంటర్నెట్ కనెక్టివిటీపై ఆధారపడదు. పీఓఎస్ టెర్మినల్ ఇంటర్నెట్ కనెక్షన్ ద్వారా లావాదేవీని పూర్తి చేయ గలదు. మరోవైపు యూపీఐ వ్యవస్థలో విశ్వసనీయత, భద్రత, సౌలభ్యాన్ని మరింత పెంచేందుకు ఎన్‌పీసీఐ స్మాల్ లాంగ్వేజ్ మోడల్ ఆధారంగా 'మైయూపీఐ' అనే ఏఐ ఆధారిత కస్టమర్ సపోర్ట్ సొల్యూషన్‌ను తీసుకొచ్చారు.

# ఎన్ఎస్ఈ ఐపీఓకు ముహూర్తం ఖరారు

- 17న ప్రారంభం.. 21న ముగియనున్న సబ్‌స్క్రిప్షన్
- ఒక్కో షేరు ధర రూ.1,700–1,785.. లాట్‌లో 8 షేర్లు
- రిటైల్ ఇన్వెస్టర్లు ఒక్క లాట్‌కు రూ.14,280 వరకు పెట్టుబడి పెట్టాలి
- రూ.22,561.57 కోట్ల విలువతో దేశంలో రెండో అతిపెద్ద ఐపీఓగా రికార్డు




**ముంబై:** మదుపర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) పబ్లిక్ ఇష్యూకు తేదీలు ఖరారయ్యాయి. సెప్టెంబరు 17న ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుండగా.. 21న ముగియనుంది. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.1,700 నుంచి రూ.1,785గా నిర్ణయించారు. ఒక్కో షేరు ముఖ విలువ రూ.1గా ఉంది.

**ముఖ్యమైన తేదీలు ఇవే..**
**సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం:** సెప్టెంబరు 17
**సబ్‌స్క్రిప్షన్ ముగింపు:** సెప్టెంబరు 21
**షేర్ల కేటాయింపు:** సెప్టెంబరు 22
**డీమ్యాట్ ఖాతాల్లో షేర్ల జమ:** సెప్టెంబరు 23
**స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్:** సెప్టెంబరు 24

ఐపీఓలో ఒక లాట్‌లో 8 షేర్లు ఉంటాయి. అప్పర్ బ్యాండ్ ధర రూ.1,785 ప్రకారం రిటైల్ ఇన్వెస్టర్లు ఒక్క లాట్‌కు రూ.14,280 చెల్లించాల్సి ఉంటుంది. అప్పర్ బ్యాండ్ ధర వద్ద ఎన్ఎస్ఈ ఐపీఓ విలువ రూ.22,561.57 కోట్లుగా ఉండనుంది. దీంతో దేశంలో రెండో అతిపెద్ద ఐపీఓగా నిలవనుంది. మొత్తం షేర్లలో 35 శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు, 50 శాతం క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు కేటాయించారు. మిగిలిన వాటాను నాన్–ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు అందుబాటులో ఉంచనున్నారు. అర్హత కలిగిన ఎన్ఎస్ఈ ఉద్యోగులకు ఒక్కో షేరుపై రూ.170 డిస్కౌంట్ లభించనుంది.మొత్తం 12.64 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (OFS) రూపంలో విక్రయించనున్నారు. ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ తదితర వాటాదారులు తమ షేర్లను విక్రయించనున్నారు. ఇందులో ఎస్‌బీఐ 2.48 కోట్ల షేర్లను విక్రయించనుంది. తొలుత 14.89 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించాలని ప్రణాళిక రూపొందించినప్పటికీ.. తర్వాత ఇష్యూ పరిమాణాన్ని 15 శాతం తగ్గించారు. వాస్తవానికి ఎన్ఎస్ఈ ఐపీఓ దశాబ్దం క్రితమే రావాల్సి ఉండగా, కో–లొకేషన్ వివాదం తదితర కారణాలతో ఆలస్యమైంది. ఇటీవలే ఈ పబ్లిక్ ఇష్యూకు సెబీ ఆమోదం లభించింది.

# ఐఫోన్ ధరల మోత.. భారత్‌లో అమ్మకాలు తగ్గేనా?

- కొత్త మోడళ్ల రాకతో పాత ఐఫోన్ల ధరలూ పెంపు
- 2026లో దేశీయ విక్రయాల్లో తొలిసారి క్షీణత ఉండొచ్చని మార్కెట్ వర్గాల అంచనా
- ధరల పెంపుతో గ్రే మార్కెట్, వ్యక్తిగత దిగుమతులు పెరిగే అవకాశం



**ముంబై:** యాపిల్ కొత్త ఐఫోన్ 18 సిరీస్‌ను విడుదల చేసిన నేపథ్యంలో భారత్‌లో ఐఫోన్ల ధరలపై చర్చ మొదలైంది. కొత్త మోడళ్లతో పాటు పాత ఐఫోన్ మోడళ్ల ధరలను కూడా సంస్థ పెంచడంతో దేశీయ విక్రయాలపై ప్రభావం పడొచ్చని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అధిక ధరలపై సామాజిక మాధ్యమాల్లోనూ వినియోగదారులు సెటైర్లు వేస్తున్నారు. మార్కెట్ పరిశోధనా సంస్థలు ఐడీసీ ఇండియా, కౌంటర్‌పాయింట్ అంచనాల ప్రకారం.. 2026 క్యాలెండర్ సంవత్సరంలో భారత్‌లో ఐఫోన్ విక్రయాలు స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. దేశీయ మార్కెట్లో ఐఫోన్ల అమ్మకాల్లో తొలిసారిగా క్షీణత నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నాయి. అయితే మొత్తం విక్రయాల విలువ పరంగా మాత్రం 6–7 శాతం వృద్ధి నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశాయి.

### గ్రే మార్కెట్‌పై ఆందోళన

ఐఫోన్ల ధరల పెంపు వల్ల గ్రే మార్కెట్ విక్రయాలు, వ్యక్తిగత దిగుమతులు పెరిగే అవకాశం ఉందని ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. విదేశీ మార్కెట్లతో పోలిస్తే భారత్‌లో ధరలు అధికంగా ఉండటం వల్ల కొంతమంది వినియోగదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించే అవకాశం ఉందని పేర్కొంది. దీనివల్ల అధికారిక రిటైల్ మార్కెట్‌పై ప్రభావం పడి, వ్యాపారులు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపింది.

### రూ.1.64 లక్షల నుంచి ఐఫోన్ 18

కొత్తగా విడుదలైన ఐఫోన్ 18 సిరీస్ ధర రూ.1,64,900 నుంచి ప్రారంభమవుతోంది. మడతపెట్టే ఐఫోన్ డ్యూయో ప్రారంభ ధర రూ.2,99,900గా ఉంది. మరోవైపు ఐఫోన్ 17, ఐఫోన్ ఎయిర్, ఐఫోన్ 16 మోడళ్ల ధరలను కూడా యాపిల్ పెంచింది. ఇతర దేశాల మార్కెట్లతో పోలిస్తే భారత్‌లో ఐఫోన్ల ధరలు సుమారు 10–15 శాతం అధికంగా ఉండటం గమనార్హం. కొత్త మోడళ్ల ధరలు, పాత మోడళ్లపై పెంపు కలిసి దేశీయ వినియోగదారుల కొనుగోలు నిర్ణయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది రానున్న రోజుల్లో కీలకంగా మారనుంది.

# నష్టాల్లోనే మార్కెట్లు

- చివర్లో భారీగా కోలుకున్న సూచీలు!
- 120 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్..
- 23,398 వద్ద ముగిసిన నిఫ్టీ
- కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో 620 పాయింట్లు రికవరీ



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. ఉదయం భారీ నష్టాలతో ప్రారంభమైన మార్కెట్లు.. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో క్రమంగా కోలుకున్నాయి. ముఖ్యంగా ఐటీ, ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ ఇంట్రాడే కనిష్ఠం నుంచి దాదాపు 620 పాయింట్లు రికవరీ అయింది. అయితే చివర్లో మళ్లీ స్వల్ప నష్టాల్లోకి జారుకుంది. ఆసియా మార్కెట్లు కూడా దాదాపు నష్టాల్లోనే ముగిశాయి.అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాల నేపథ్యంలో సెన్సెక్స్ ఉదయం 74,309.16 వద్ద ప్రారంభమైంది. క్రితం ముగింపు 74,902.59తో పోలిస్తే ఇది భారీ పతనం. ఇంట్రాడేలో 74,160.16 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆ తర్వాత కొనుగోళ్ల మద్దతుతో నష్టాలను పూడ్చుకుంది. చివరికి 120.83 పాయింట్ల నష్టంతో 74,781.76 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 79.70 పాయింట్లు కోల్పోయి 23,398 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.57గా నమోదైంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, రిలయన్స్, సన్‌ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ షేర్లు నష్టపోయాయి. మరోవైపు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 103 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్సు ధర 4,347 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



# తమన్నా 'ది వివాన్' నుంచి 'ఛరీ మైయా' పాట

హిందీ కథానాయకుడు సిద్ధార్థ్ మల్హోత్రా, తమన్నా జంటగా నటించిన మోస్ట్ అవైటెడ్ చిత్రం 'ది వివాన్'. దీపక్ కుమార్ మెహతా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని శోభా కపూర్, ఏక్తా ఆర్. కపూర్ తదితరులు కలిసి నిర్మించారు. వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమా ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా తాజాగా 'ఛరీ మైయా' అనే భక్తి గీతాన్ని సోషల్ మీడియాలో విడుదల చేసింది. హీరోహీరోయిన్ల సంభాషణలతో ఈ పాట ప్రారంభమవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'నువ్వు పూజ చేయగలవా? ఎందుకంత మొండితనం..' అంటూ సిద్ధార్థ్ మల్హోత్రా ప్రశ్నించగా.. 'నాకు పూర్తి నమ్మకం ఉంది. ఈ ఛరీ మైయా మనల్ని తప్పకుండా ఆశీర్వదిస్తుందని' అంటూ తమన్నా సమాధానం చెప్పే సన్నివేశాలతో పాట మొదలవుతుంది. ఆ తర్వాత 'ఈ లోకంలో నీ దయతో తీరని దుఃఖం లేదు.. ఛరీ మాత! నిన్ను వేడుకుంటే లభించని వరంలేదు.. నా విన్నపం వినమ్మా' అంటూ సాగే భక్తిరస గీతం ఆకట్టుకుంటోంది. పాటలో పూజా కార్యక్రమాలు, భక్తి వాతావరణం, సంప్రదాయ ఆచారాలను అందంగా చూపించారు. ముఖ్యంగా సంప్రదాయ దుస్తుల్లో కనిపించిన తమన్నా అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఆమె లుక్‌తో పాటు పాటలోని భక్తిభావం సినిమాకు సంబంధించిన కథలోని మరో కోణాన్ని పరిచయం చేస్తున్నట్లుగా అనిపిస్తోంది. హీరోహీరోయిన్ల మధ్య కనిపించే అనుబంధం, వారి సంభాషణలు పాటకు మరింత భావోద్వేగాన్ని జోడిస్తున్నాయి. కౌశల్ సాహిత్యం అందించిన ఈ గీతానికి విశాల్ మిశ్రా స్వరాలు సమకూర్చడమే కాకుండా స్వయంగా ఆలపించారు. భక్తి భావాన్ని ప్రతిబింబించేలా ఆయన అందించిన ట్యూన్, గాత్రం పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇప్పటికే విడుదలైన 'ఛరీ మైయా' పాటకు మంచి స్పందన వస్తుండగా.. ఈ గీతం సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. మరి సిద్ధార్థ్ మల్హోత్రా, తమన్నా జోడీ 'ది వివాన్'తో ఎలాంటి అనుభూతిని అందిస్తారో తెలియాలంటే ఈ నెల 25 వరకు వేచి చూడాల్సిందే.



# 'నయీ నవేలీ' టీజర్ అదిరింది

బాలీవుడ్ నటి యామీ గౌతమ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సరికొత్త ఫాంటసీ ఫ్యామిలీ హారర్ కామెడీ మూవీ 'నయీ నవేలీ'. అమెజాన్ ఎంజీఎమ్ స్టూడియోస్, కలర్ ఎల్లో నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం నుంచి తాజాగా టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'మా వదినో మంత్రగత్తె' అంటూ మరిది చెప్పే డైలాగ్‌తో మొదలైన టీజర్.. ఓ సాధారణ ఉమ్మడి కుటుంబంలోకి కొత్తగా అడుగుపెట్టిన వధువు చుట్టూ కథ తిరగబోతుందనే ఆసక్తిని కలిగిస్తోంది. ఆ తర్వాత 'మంత్రగత్తె.. అంతేనా.. ఇద్దరు మంత్రగత్తెలు, మూడు పిశాచాలను, నాలుగు దెయ్యాలను నేను రోజూ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లా తినేస్తాను.. లేడీస్ అండ్ జెంటిల్‌మెన్.. ఒక చిన్న విన్నపం.. థింక్ బిగ్' అంటూ యామీ గౌతమ్ మంత్రగత్తెగా ఇచ్చిన ఎంట్రీ టీజర్‌కు హైలైట్‌గా నిలిచింది. కామెడీ, ఫాంటసీ, హారర్ అంశాలను ఆసక్తికరంగా మేళవించిన ఈ టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. 'మారి', 'లవ్ ఫెయిల్యూర్' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు బాలాజీ మోహన్ ఈ సినిమాను తెరకెక్కిస్తుండగా, జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. దసరా సెలవుల సీజన్‌ను టార్గెట్ చేస్తూ 'నయీ నవేలీ'ని అక్టోబర్ 16న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు.

# కొడుకు ఫొటోను పంచుకున్న వరుణ్ తేజ్-లావణ్య

టాలీవుడ్ నటుడు వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి దంపతులు తమ కుమారుడు వాయువ్ తేజ్ తొలి జన్మదినం సందర్భంగా చిన్నారి ఫొటోను తొలిసారిగా సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 10న ఈ దంపతులకు కుమారుడు జన్మించగా, అతడికి 'వాయువ్ తేజ్' అని నామకరణం చేసిన విషయాన్ని అప్పట్లోనే ప్రకటించారు. ఇవాళ వాయువ్ తొలి పుట్టినరోజు కావడంతో అతడి ఫొటోను అభిమానులతో పంచుకోవడంతో అది క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



# డివోషనల్ థ్రిల్లర్‌గా మహేంద్రగిరి వారాహి

సుమంత్ హీరోగా, సిద్ధు జొన్నలగడ్డ కీలక పాత్రలో, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి గోస్వామి, మాళవికా నాయర్, వెన్నెల కిశోర్, బ్రహ్మానందం, రాజీవ్ కనకాల తదితరులు నటించిన చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. సంతోష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాను కలిపు మధు, సురభి లక్ష్మణరావు నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించగా, ప్రతాప్ ఆర్. కృష్ణ సినిమాటోగ్రఫీ, జునైద్ సిద్ధిఖీ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. తాజాగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి డివోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'మహేంద్రగిరి వారాహి' ప్రేక్షకులను ఏ మేరకు మెప్పించిందో తెలుసుకుందాం.



## కథ ఏంటంటే..

మహేంద్రగిరి అనే గ్రామంలో వారాహి అమ్మ వారు కొలువై ఉంటారు. అక్కడి రాజ కుటుంబీకులు చేసిన ఓ పొరపాటు కారణంగా వారాహి అమ్మవారు ఆ కుటుంబానికి శాపం విధించినట్లు కథ సాగుతుంది. ఆ శాపం ప్రభావంతో ఆ వంశంలో పుట్టిన ప్రతి మగబిడ్డ 33 ఏళ్లకే మరణిస్తుంటాడు. ఈ మరణాలన్నీ వారాహి అమ్మవారి శాపం వల్లే జరుగుతున్నాయని గ్రామస్తులు నమ్ముతుంటారు. అయితే మనుషులను కాపాడాల్సిన గ్రామదేవతే వారిని ఎందుకు అంతం చేస్తోంది? అసలు వారాహి అమ్మవారికి ఆ కుటుంబంపై ఎందు కు కోపం వచ్చింది? సిద్ధార్థ్ (సుమంత్) ఈ వరుస మరణాల వెనుక ఉన్న రహస్యాన్ని ఎలా ఛేదించాడు? ఈ చావులకు నిజంగానే శాపమే కారణమా? లేక దీని వెనుక మరో కారణం ఉందా? అనే ఆసక్తికర ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ. దర్శకుడు సంతోష్ జాగర్లమూడి ఎంచుకున్న ప్రధాన కథాంశం ఆసక్తికరంగా ఉంది. డివోషనల్ టచ్‌తో పాటు సినిమాలోని కొన్ని ఎమోషనల్ సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. అనూప్ రూబెన్స్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా సినిమాకు మంచి బలాన్ని ఇచ్చింది. నటీనటుల విషయానికి వస్తే.. సుమంత్ తన పాత్రలో చక్కగా ఒదిగిపోయాడు. నిజాన్ని వెలికితీసే యూట్యూబర్ సిద్ధార్థ్‌గా ఆయన రియలిస్టిక్ యాక్టింగ్‌తో మెప్పించాడు. ముఖ్యంగా ఫస్ట్ హాఫ్‌లోని అడ్వెంచర్ సన్నివేశా లతో పాటు సెకండాఫ్‌లో వచ్చే కీలక సన్నివేశాల్లో సుమంత్ నటన ఆకట్టుకుంటుంది. ఐశ్వర్య రాజేష్ తన పాత్రకు న్యాయం చేయగా, మీనాక్షి గోస్వామి కొన్ని భావోద్వేగ సన్నివేశాల్లో మంచి పెర్ఫార్మెన్స్ ఇచ్చింది. మాళవికా నాయర్ కూడా కీలక పాత్రలో బాగా నటించింది. వెన్నెల కిశోర్, బ్రహ్మానందం, రాజీవ్ కనకాలతో పాటు మిగతా నటీనటులు తమ పాత్రల పరిధిలో మెప్పించారు. దర్శకుడు కథలోని సస్పెన్స్‌ను కొంతవరకు బాగానే మెయింటైన్ చేశాడు. అడ్వెంచర్ సన్నివేశాలను కూడా ఆసక్తికరంగా తెరకెక్కించాడు.

## మైనస్ పాయింట్స్

డివోషనల్ థ్రిల్లర్ కథాంశాన్ని ఎంచుకున్నప్పుడు సినిమా ఆద్యంతం ఉత్కంఠను కొనసాగిస్తూ ప్రేక్షకులను కథలో లీనమయ్యేలా చేయాలి. అయితే 'మహేంద్రగిరి వారాహి'లో కొన్ని ఎమోషనల్ సన్నివేశాలు మినహా మిగతా సన్నివేశాలు ఆశించిన స్థాయిలో ఆకట్టుకోవు. సెకండాఫ్‌ను థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఆసక్తికరంగా నడిపేందుకు దర్శకుడు ప్రయత్నించినప్పటికీ ఆ ప్రయత్నం స్క్రీన్‌పై పూర్తిస్థాయిలో ప్రభావం చూపలేదు. ముఖ్యంగా సినిమా కొన్ని చోట్ల గందరగోళంగా సాగడంతో ప్రేక్షకులు కథతో పూర్తిగా కనెక్ట్ కావడం కష్టంగా అనిపిస్తుంది. రాజ కుటుంబీకుల శాపం, వరుస మరణాల నేపథ్యం కూడా కొత్తగా అనిపించదు. గతంలో వచ్చిన కొన్ని చిత్రాల సంఘటనలు గుర్తుకు వస్తుంటాయి. సినిమాలోని ప్రధాన క్యారెక్టరైజేషన్స్, ముఖ్యంగా విలన్ పాత్రలు బలమైన ఎమోషన్‌తో డిజైన్ చేయకపోవడం మైనస్‌గా మారింది. కొన్ని సన్నివేశాల్లో నాటకీయత ఎక్కువ కావడంతో సహజత్వం లోపించింది. ముఖ్యంగా వెన్నెల కిశోర్, బ్రహ్మానందం పాత్రలు కథలో అసహజంగా అనిపిస్తాయి. మంచి కథా నేపథ్యాన్ని ఎంచుకోవడం లో సక్సెస్ అయిన దర్శకుడు సంతోష్ జాగర్ల మూడి.. దానికి తగ్గ ఉత్కం ఠభరితమైన కథనాన్ని అందించ డంలో మాత్రం కొంత వెనుకబడ్డా రు. అయితే ఆయన రూపొందించిన కొన్ని సన్నివే శాలు, విజువల్ ఎఫ్ఎక్స్‌ను ఉపయోగించిన విధానం ఆకట్టుకుంటాయి. అనూప్ రూబెన్స్ సంగీతం, ముఖ్యంగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ బాగుంది. ప్రతాప్ ఆర్. కృష్ణ అందించిన సినిమాటోగ్రఫీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జునైద్ సిద్ధిఖీ ఎడిటింగ్ కూడా బాగుంది. వైవిధ్యమైన కథాంశాన్ని నమ్మి ఈ చిత్రాన్ని నిర్మించిన నిర్మాతల నిర్మాణ విలువలు మెప్పిస్తాయి. చివరగా 'మహేంద్రగిరి వారాహి'లో కొన్ని ఆసక్తికర మైన డివోషనల్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ ఉన్నాయి. ముఖ్యంగా దర్శకుడు సంతోష్ జాగర్లమూడి రాసు కున్న కథ, కొన్ని థ్రిల్లింగ్ సన్నివేశాలు, ట్విస్టులు సినిమాకు ప్లస్‌గా నిలిచాయి. అయితే నెమ్మదిగా సాగే స్క్రీన్‌ప్లే, బలమైన కాన్ఫ్లిక్ట్ లేకపోవడం, కొన్ని సన్నివే శాలు లాజిక్‌కు దూరంగా సాగడం సినిమాకు బలహీనతలుగా మారాయి. ఓవరాల్‌గా భిన్నమైన డివోషనల్ కథాంశాలతో తెరకెక్కిన సినిమాలను ఇష్టపడే ప్రేక్షకు లకు 'మహేంద్రగిరి వారాహి' కొంతవరకు కనెక్ట్ అయ్యే అవకాశం ఉంది.



# సంక్రాంతి బ్లాక్‌బస్టర్ లోడ్

విక్టరీ వెంకటేష్, కళ్యాణ్ రామ్ హీరోలుగా, కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా హిట్ మిషన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'జనవరి 12'. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇప్పటికే ఫస్ట్ హాఫ్ పూర్తికాగా, సెకండ్ హాఫ్‌లోనూ మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసినట్లు మేకర్స్ వెల్లడించారు. తాజాగా ఈ సినిమాకు సంగీతం అందిస్తున్న యంగ్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాశ్ కుమార్ చేసిన పోస్ట్ సినిమాపై హైప్‌ను మరింత పెంచింది. 'నేను ఇప్పుడే ఈ చిత్రంలోని 1 గంట 30 నిమిషాల ఫుటేజ్‌ను చూశాను. సంక్రాంతి బ్లాక్‌బస్టర్ లోడ్ అవుతుంది.. అనిల్' అంటూ ఫైర్ ఎమోజీలతో ఆయన పోస్ట్ చేశారు. దీంతో దీనికి సంబంధించిన స్క్రీన్‌షాట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. జి.వి. ప్రకాశ్ కామెంట్స్‌తో 'సంక్రాంతికి బ్లాక్‌బస్టర్ ఖాయం', 'బ్లాక్‌బస్టర్ తీర్పు ముందే వచ్చేసింది' అంటూ నెటిజన్లు కామెంట్లతో సందడి చేస్తున్నారు.

# నాగచైతన్య 'వృషకర్మ' రిలీజ్ డేట్ లాక్



యువ సామ్రాట్ నాగచైతన్య, విజనరీ ఫిల్మ్ మేకర్ కార్తీక్ దండు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ ఎవైటెడ్ మైథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ'. ఎస్‌వీసీసీ, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని బాపినీడు సమర్పిస్తున్నారు. మైథాలజీ, మిస్టరీ, థ్రిల్లర్ అంశాలను మునుపెన్నడూ చూడని సరికొత్త నేపథ్యంలో మేళవిస్తూ భారీ స్థాయిలో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. తాజాగా 'వృషకర్మ' ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 4, 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కార్తీక్ దండు డిఫరెంట్ విజన్‌కు ఎస్‌వీసీసీ, సుకుమార్ రైటింగ్స్ క్రియేటివ్ ఫోర్సెస్ తోడవడంతో 'వృషకర్మ'పై అంచనాలు మరింత పెరిగాయి. ఇప్పటికే విడుదలైన స్ట్రైకింగ్ గ్లింప్స్, బిహైండ్ ది సీన్స్ వీడియోలు సినిమాపై భారీ ఆసక్తిని పెంచాయి. ఈ వీడియోలు 'వృషకర్మ'లోని యూనిక్ వరల్డ్, భారీ స్కేల్, విజువల్ గ్రాండియర్‌కు సంబంధించిన ఆసక్తికరమైన జ్ఞాపకాన్ని ప్రేక్షకులకు అందించా యి. వైవిధ్య మైన, ఛాలెంజింగ్ కథలను ఎంచుకుం టున్న నాగచైతన్య ఈ సినిమాలో ఇప్పటివరకు కనిపించని డిఫరెంట్ రోల్‌లో దర్శనమివ్వనున్నారు. ఈ పాత్ర కోసం ఆయన భారీగా ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. ఇప్పటికే తనకు సంబంధించి న షూటింగ్ ను పూర్తి చేశారు. మీనాక్షి చౌదరి కథానాయిక గా నటిస్తుండ గా, స్పర్శ్ శ్రీవాస్తవ విలన్‌గా కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో స్పర్శ్ శ్రీవాస్తవ స్ట్రైకింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఇంటెన్స్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకోవడంతో ఆయన పాత్రపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ప్రస్తుతం 'వృషకర్మ' షూటింగ్ చివరి దశలో కొనసాగుతోంది. 'వృష కర్మ' కోసం బల మై న సాంకే తిక బృం దం పనిచే స్తోంది. రాగుల్ డి హెరియన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అజనీష్ బి. లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తూ సినిమా కథకు తగ్గ ప్రత్యేకమైన ప్రపంచాన్ని సృష్టిస్తు న్నారు.

# బాలీవుడ్‌పై శ్రీలీల ఫోకస్..

ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అనతి కాలంలోనే క్రేజీ హీరోయిన్‌గా మారిపోయి వరుస ఆఫర్లు అందుకున్న యంగ్ బ్యూటీ శ్రీలీల.. తన అద్భుతమైన డ్యాన్స్, గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. యువతతో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా ఆకట్టుకున్న ఈ భామ.. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా పలువురు స్టార్ హీరోల సరసన నటించే అవకాశాలను సొంతం చేసుకుంది. వరుస సినిమాలతో కొంతకాలం టాలీవుడ్‌లో దూసుకెళ్లిన శ్రీలీల.. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేసింది. అయితే ఆమె నటించిన కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ప్రస్తుతం అవకాశాల విషయంలో కాస్త స్పీడ్ తగ్గిందనే టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో శ్రీలీల తన ఫోకస్‌ను బాలీవుడ్‌పైకి మళ్లించినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే హిందీ చిత్ర పరిశ్రమలో రెండు, మూడు అవకాశాలు అందుకున్న ఆమె.. అక్కడ కూడా వరుస సినిమాలతో తన మార్క్ చూపించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచా రం. ముఖ్యంగా బాలీవుడ్‌లో మంచి ప్రాజెక్టు లు దక్కించుకుని అక్కడ స్థిరపడే దిశగా అడుగులు వేస్తున్నట్లు టాక్. అంతేకాకుండా హైదరాబాద్ నుంచి ముంబైకి తన మకాం మార్చిందని, అక్కడ ఓ విలాసవంతమైన బంగ్లాను కూడా కొనుగోలు చేసినట్లు బాలీవుడ్, టాలీవుడ్ వర్గాల్లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం బాలీవుడ్ యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఓ సినిమాలో శ్రీలీల నటిస్తోంది. ఈ సినిమా ఆమెకు అక్కడ మంచి బ్రేక్ ఇస్తే బాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకోవడం మరింత సులభమవుతుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నా రు. ముఖ్యంగా డ్యాన్స్, గ్లామర్‌తో పాటు పెర్ఫార్మెన్స్ పరంగా కూడా శ్రీలీలకు ఉన్న ప్లస్ పాయింట్లు హిందీలో ఆమెకు కలిసొచ్చే అవకాశముంద ని అంటున్నారు.



Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.